
IRS PUBLICATIONS
e-mail: irspublications123@gmail.com
http://www.suryavastavam.in

Truth of News
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in

గురువారం | 04 జూలై 2024 | తిరుపతి

సంపుటి 1 | సంచిక 30
పేజీలు 8+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Tirupati, Guntur, Nellore, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi




# మళ్లీ అదే మాట అంటూ అవమానిస్తున్నారు..

## మోదీపై ప్రతిపక్షాల ధ్వజం



న్యూఢిల్లీ **జూలై** 3 (సూర్య వాస్తవం) : లోక్‌సభ విపక్ష నేత రాహుల్‌గాంధీవి పిల్ల చేష్టలు (బాలక్ బుద్ధి) అని ప్రధాని నరేంద్రమోదీ అన్న వ్యాఖ్యలపై కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు తీవ్ర అభ్యంతరం తెలిపాయి. లోక్‌సభలో మంగళవారం ప్రధాని మాట్లాడుతూ.. విపక్ష నేత రాహుల్‌గాంధీవి పిల్ల చేష్టలు (బాలక్ బుద్ధి) అని ఎద్దేవా చేశారు. కేవలం సానుభూతి పొందడం కోసమే సభలో కాంగ్రెస్ కొత్త నాటకాలు ఆడుతోందని ఆరోపించారు. "దేశంలో అర్థిక అరాచకత్వం సృష్టించాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ఓటమిని అంగీకరించకుండా అహంకారంతో ప్రవర్తిస్తోంది. ఓబీసీలను దొంగలుగా సంబోధించినందుకు వారికి శిక్ష పడింది. 2లో

# మోదీ చేసిన ప్రసంగం ఎన్నికల ప్రసంగం

## జైరాం రమేష్



ఢిల్లీ, సూర్య వాస్తవం: పార్లమెంటులో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ప్రసంగాన్ని వక్రీకరించి, తప్పుదారిపట్టించిన తీరు చూస్తే ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నికల ప్రసంగం చేసినట్టు ఉందని, పార్లమెంట్‌లో మాట్లాడిన తరహాలో లేదని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ అన్నారు. రాజ్యసభలో కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ ఆరోపణలు చేశారని, కానీ 2లో

### రాజధాని మార్పు జరిగితే ఏమవుతుందో


# అమరావతి ఒక కేసు స్టడీ

## అమరావతిపై శ్వేతపత్రం విడుదల సీఎం చంద్రబాబు




అమరావతి, సూర్య వాస్తవం: ప్రారంభ దశనుండి ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతీ ఎన్నో అటుపోటులకు గురవుతుంది. విభజన అనంతరం టీడీపీ ప్రభుత్వ హయంలో కొంతమేర నిర్మాణ పనులను చేప్పటినా, తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర రాజధాని మార్పు పేరుతో అమరావతీ నిర్మాణానికి పురిటిలోనే పాడికట్టింది. వారి హయంలోని 5 ఏళ్లలో అమరావతీ ఒక అడవిని తలపించెలా ముండ్ల పొదలతో నిండిపోయింది. తాజాగా స్థానిక ఎన్నికల 4లో



అమరావతి, **జూలై** 3 (సూర్య వాస్తవం) : జూలై 8వ తేదీ నుంచి ఉచిత ఇసుక విధానం అమల్లోకి తీసుకురావాలని రాష్ట్ర ముఖ్యమంతి చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు చర్యలు చేపట్టాలని మంత్రి కొల్లు రవీంద్రకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ల అధ్యక్షతన కమిటీ ఏర్పాటు చేసి, ఇసుక లోడింగ్, రవాణా ఛార్జీలు నిర్ణయించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇసుక అక్రమ తవ్వకాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. గత ఐదేళ్లలో ఇసుక పాలసీ వల్ల పేదలు తీవ్రంగా నష్టపోయారని, గృహ నిర్మాణ రంగం కుదేలైందని చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో 2014- 2019 మధ్య కాలంలో రాష్ట్రంలో అమలులో ఉన్న ఇసుక విధానం, 2019-2024 మధ్య అమ్మకాల లాభ, నష్టాలపై అధికారులతో చంద్రబాబు చర్చించారు. గత ప్రభుత్వ హయాంలో ఇసుక అమ్మకాల పేరుతో భారీగా దోపిడి జరిగిందని చెబుతున్న కూటమి సర్కార్.. ఎన్నికలకు ముందు తమ ప్రభుత్వం అధికారం చేపట్టితే ఉచిత ఇసుక విధానం అమలు చేస్తామని మేనిపెస్టోలో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇచ్చిన హామీ ప్రకారం ఉచిత ఇసుక పాలసీ ద్వారా పేదలకు ఉచితంగా ఇసుక అందించాలని నిర్ణయించుకున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. ఇసుక అమ్మకాల విధానంలో ఎవరు లబ్దిపొందారు అనే దానిపై ఆరా తీస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇసుక పాలసీ వల్ల ధరలు పెంచడంతో పేదలు 4లో

### ఉప్పాడ సముద్రపు కోత సమస్యకు

# శాశ్వత పరిష్కారం చూపండి

## ఉప్పాడ తీర ప్రాంతాన్ని పరిశీలించిన ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్



పిఠాపురం, సూర్య వాస్తవం: పిఠాపురం నియోజకవర్గంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవెర్చే పనిని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ మొదలుపెట్టారు. ఉప్పాడ తీర ప్రాంత గ్రామాలను సముద్రపు కోత నుంచి కాపాడే క్రమంలో కార్యచరణకు దిగారు. బుధవారం ఉప్పాడ తీరంతో సముద్రపు కోతకు గురయిన ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడ మారీ టైమ్ బోర్డు, కేంద్ర ఖగోళశాస్త్ర మంత్రిత్వ శాఖ(ఎర్త్ సైన్స్ మినిస్ట్రి) అధికారులు, రెవెన్యూ అధికారులతో చర్చించారు. సముద్రపు కోతకు గల కారణాలు, నివారణోపాయాలు వారిని అడిగి తెలుసుకున్నారు. ఉప్పాడ తీరంలోనే సముద్రం ఎందుకు ముందుకు వస్తోంది? దీనికి గల కారణాలు, తీరాన్ని కోతకు గురి కాకుండా చేయాల్సిన మార్గాలు అన్వేషించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని, దీనిపై శాస్త్రీయంగా సర్వే నిర్వహించి పనులు మొదలు పెడదామని చెప్పారు. దీనికి శాశ్వత పరిష్కారం చూపేలా అధికారులకు తగు సూచనలు ఇచ్చారు. ఉప్పాడ గ్రామ తీర ప్రాంతంలో మొత్తం 84 ఎకరాల విస్తీర్ణంతో భూమి సముద్రంలో కలిసిపోయిందని జిల్లా సర్వేయర్ శ్రీ లక్ష్మీ నారాయణ తెలిపారు. 60 ఎకరాలు కోతకు గురయ్యాక సర్వే ప్రారంభించినట్టు, సర్వే ప్రారంభించిన తర్వాత మరో 20 ఎకరాలు సముద్రంలోకి వెళ్లిపోయిన విషయాన్ని వివరించారు. 8 తీర ప్రాంత గ్రామాల్లో 1360 ఎకరాలు కోతకు గురైన విషయాన్ని తెలుసుకుని పవన్ కళ్యాణ్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. చెన్నై నుంచి ఉప్పాడ తీర ప్రాంత కోతపై పరిశోధన జరిపేందుకు వచ్చిన కేంద్ర ఖగోళశాస్త్ర మంత్రిత్వశాఖ అధికారులు, మారిటైం బోర్డు అధికారులను సముద్రపు కోతపై పూర్తి స్థాయిలో అధ్యయనం జరపాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, పిఠాపురం నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జ్ వర్మ, జనసేన సమన్వయకర్త మరెడ్డి శ్రీనివాస్, జనసేన పార్టీ జాతీయ అధికార ప్రతినిధి వేములపాటి అజయ్ కుమార్ పాల్గొన్నారు.

# ఖర్గే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన కె.కేశవరావు



న్యూఢిల్లీ **జూలై** 3 (సూర్య వాస్తవం) : సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు కె.కేశవరావు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం దిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే.. కేశవరావుకు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, రాష్ట్ర వ్యవహారాల ఇన్ఛార్జి దీపాదాస్ మున్షీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కేకే కుమార్తె, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి గతంలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే.

## టీపీసీసీ అధ్యక్షుడి నియామకం తాత్కాలికంగా వాయిదా

న్యూఢిల్లీ **జూలై** 3 (సూర్య వాస్తవం) :తెలంగాణ నూతన పీసీసీ అధ్యక్షుడి నియామకం తాత్కాలికంగా వాయిదా పడింది. కాంగ్రెస్ నేతల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోడంతో ఎంపిక ప్రక్రియను ఏఐసీసీ వాయిదా వేసినట్టు తెలుస్తోంది. ఈ విషయమై వారం రోజుల్లో మరోసారి చర్చించాలని పార్టీ పెద్దలు నిర్ణయించారు. కాంగ్రెస్ అగ్రనేతల పరస్పర అంగీకారం అనంతరం పీసీసీ అధ్యక్షుడిని నియమించే అవకాశం ఉన్నట్లు సమాచారం. పీసీసీ పదవి కోసం ఎమ్మెల్సీ మహేశ్ కుమార్‌గౌడ్, మాజీ ఎంపీ మధుయాస్కీ గౌడ్, ఎంపీలు బలరాంనాయక్, సురేశ్ షెట్కర్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్‌లు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్కలు సైతం అధ్యక్ష పదవిని అడుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. పీసీసీ అధ్యక్షుడి నియామకం తర్వాతే మంత్రివర్గ విస్తరణ ఉండొచ్చని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

## ఏపీ ఇంటలిజెన్స్ విభాగం చీఫ్‌గా మహేశ్ చంద్ర లడ్హా నియామకం

4లో




## 3 నెలల్లో 1.28 లక్షల గృహాలను పూర్తి చేయాలి


4లో

# “సూర్య- మహిళా నేస్తం”

## గర్భిణీ స్త్రీలలో జికా వైరస్

### కేంద్రప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు సూచనలు



మహారాష్ట్రలో జికా వైరస్ కేసులు ఆందోళన కలిగిస్తున్నాయి. పూణెలో ఇద్దరు గర్భిణీలు సహా ఆరుగురికి జికా వైరస్ పాజిటివ్ అని తేలిన విషయం తెలిసిందే.అరంద్వానే ప్రాంతంలో నాలుగు, ముంద్వా ప్రాంతంలో రెండు కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం వీరి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. జికా వైరస్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రం అన్ని రాష్ట్రాలకు మార్గదర్శకాలను జారీ చేసింది.ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు అప్రమత్తంగా ఉండాలి. వారికి నిరంతరం పరీక్షలు నిర్వహించాలి. ఈ వైరస్ పాజిటివ్‌గా పరీక్షించిన తల్లుల పిండాల పెరుగుదలను పర్యవేక్షించాలి. వారిపట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కేంద్రం కోరింది. అలాగే ఈ వైరస్‌కు గురైన బాధిత గర్భిణీ స్త్రీ పిండంలో జికా మైక్రోసెఫాలీ నాడీ సంబంధిత పరిణామాలతో సంబంధం కలిగి ఉన్నందున, పర్యవేక్షణ కోసం వైద్యులను అప్రమత్తం చేయాలని కేంద్రం సూచించింది. నివాస ప్రాంతాలు, కార్యాలయాలు, పాఠశాలలు, నిర్మాణ స్థలాలు, సంస్థలు,ఆరోగ్య సౌకరాల్లో కీటకాలు లేకుండా నిఘా పెంచాలని, నియంత్రణ కార్యకలాపాలను తీవ్రతరం చేయాలని రాష్ట్రాలను కేంద్ర ఆరోగ్యమంత్రిత్వశాఖ ఆదేశించింది. ఈ వైరస్ పట్ల ప్రజల్లో భయాందోళనలను తగ్గించడానికి సోషల్ మీడియా, ఇతర ఫ్లాట్‌ఫారమ్‌లలో ముందు జాగ్రత్తగా సందేశాలు పంపి అవగాహన కల్పించాలని రాష్ట్రాలను కోరింది.

## మళ్లీ అదే మాట అంటూ అవమానిస్తున్నారు..

మొదటి పేజీ తరువాయి

దేశ అత్యున్నత న్యాయస్థానంపై బాధ్యతారాహిత్య వ్యాఖ్యలకు వారు క్షమాపణ చెప్పాల్సి వచ్చింది. సందర్భానికి తగ్గట్లు స్వరం మార్చే అలాంటి నేత (రాహుల్‌గాంధీని ఉద్దేశించి) ఇలాంటి అరాచకమైన మార్గాన్ని ఎంచుకోవడం.. దేశాన్ని ఇబ్బందుల్లోకి నెట్టేయడమే. వారి మాటతీరు, వ్యవహారశైలి బాగా లేదు. సభలో ఉన్నట్టుండి ఎవరివద్దకో వెళ్లి కౌగిలించుకుంటారు... లేదంటే సభలో కూర్చొని కన్ను కొడతారు. 60 ఏళ్లు దేశాన్ని పాలించిన పార్టీకి అనుభవజ్ఞులైన నాయకులున్నా అరాచక, అబద్ధాల రహదారిపై వెళ్లాలనుకోవడం అత్యంత ఆందోళనకరం. అందుకే వారితో ఒరిగేదేమీ లేదని ప్రజలు కాంగ్రెస్‌ను తిరస్కరించారు” అని మోదీ అన్నారు. దీనిపై ప్రతిపక్షాలు స్పందిస్తూ... ఈ ఎన్నికల్లో 140 కోట్ల మంది భారతీయులు మీతో ఒరిగిందేమీ లేదని నరేంద్ర మోదీ ప్రభుత్వానికి తెలియజేశారని విమర్శించాయి. కాంగ్రెస్‌ను ‘పరాన్న జీవి’ అంటూ మోదీ చేసిన వ్యాఖ్యలపై ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎక్స్ వేదికగా స్పందించారు. “2020-21లో రైతుల నిరసన సమయంలో వారిని ఉద్దేశించి మోదీ అదే పదాన్ని ఉపయోగించారు. ఈ రోజు కాంగ్రెస్‌ను అలాగే అవమానిస్తున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో 140 కోట్ల మంది భారతీయులు మీ ప్రభుత్వంతో ఒరిగిందేమీ లేదని చెప్పకనే చెప్పారు. మోదీజీ మీరు ముందు ప్రజల మనోభావాలను అర్థం చేసుకోండి. నియంతృత్వాన్ని వదిలివేయండి!” అని కాంగ్రెస్ చీఫ్ పేర్కొన్నారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ స్పందిస్తూ.. “నీట్‌పై ఎవరూ ప్రశ్నలు వేయకూడదని ప్రధాని ఈ విషయాలన్నీ మాట్లాడుతున్నారు. పిల్ల చేష్టలు అని మాట్లాడేవారే పిల్ల చేష్టలు చేస్తుంటారు. ఎందుకంటే ప్రజలు ఎన్నుకున్న నాయకుల గురించి ఇటువంటి వ్యాఖ్యలు చేయకూడదని వారికి తెలియదు. కేంద్ర ప్రభుత్వంలో ఇప్పటికీ ఎంతోమంది చేతకాని పిల్లలు ఉన్నారు. వారు దేశ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అర్థం చేసుకోలేరు” అంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

## మోదీ చేసిన ప్రసంగం ఎన్నికల ప్రసంగం

వాటిని తిప్పికొట్టేందుకు మల్లికార్జున్ ఖర్గే లేచి నిలుచున్నా ఆయనకు అవకాశం ఇవ్వలేదని ఆరోపించారు. ప్రధాని పార్లమెంట్ వేదికగా అసత్యాలు వల్లెవేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌కు మెజారిటీ రాకపోయినా ఆయనకూ ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజారిటీ రాలేదనే విషయం ప్రధాని అర్థం చేసుకోవాలని అన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికలు మోదీకి వ్యక్తిగతంగా, నైతికంగా, రాజకీయంగా నష్టం చేకూర్చాయనే విషయం ఆయన గుర్తెరగాలని చెప్పారు. ప్రధాని మోదీ మూడింట ఓ వంతు ప్రధాని అని తాను అంటే ఆయన దాన్ని కూడా వక్రీకరించి తాను మూడింట ఓ వంతు ప్రభుత్వమని అన్నట్టు ప్రచారం చేశారని చెప్పారు. నాయుడు, నితీష్ లేకుంటే మోదీ ప్రధాని కాలేరని పేర్కొన్నారు.మోదీ 240 దగ్గరే ఆగిపోయారు..ఆయనకు అనుకూలంగా ప్రజా తీర్పు రాలేదని వివరించారు. ఆయన మూడోసారి ప్రధాని కావడం వాస్తవమే అయినా ఆయనకు మెజారిటీ మాత్రం దక్కలేదని జైరాం రమేష్ వ్యాఖ్యానించారు.

## సూర్య పసిడి ధరలు



హైదరాబాద్ **జూలై** 3 (సూర్య వాస్తవం) : ఆంధ్రప్రదేశ్ తో పాటు తెలంగాణలో 22, 24 క్యారెట్ల బంగారంతో పాటు వెండి ధరల వివరాలు ఇలా ఉన్నాయి.బుధవారం (03-07-2024) హైదరాబాద్ లో ఒక గ్రాము 22 క్యారట్ల బంగారం ధర రూ. 6635 గాను, 8 గ్రాముల బంగారంధర రూ. 53,080 గా ఉంది. అలాగే 10 గ్రాముల (తులం) బంగారం ధర రూ. 66,350 గా ఉంది, ఇక 2 వటారీకుతో పోల్చుకుంటే 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధరలో ఎలాంటి తేడా లేదు.

# ఆస్ట్రేలియాలోని సిడ్నీలో జనసేన విజయోత్సవ సంబరాలు

(సూర్య వెబ్ డెస్క్)







ఆస్ట్రేలియా జనసేన ఆధ్వర్యంలో ఘనంగా జనసేన విజయోత్సవ వేడుకలు అంగరంగవైభవంగా నిర్వహించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో జనసేన పోటీచేసిన అన్ని స్థానాలలోను గెలిచిన సందర్భంగా ఆస్ట్రేలియా దేశంలో, సిడ్నీలో ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జనసేన పోటీ చేసిన 21 ఎమ్మెల్యే స్థానాలలోను మరియు 2 ఎంపి స్థానాలలోను గెలిచి 100 పర్సెంట్ సక్సెస్ రేటుతో చరిత్ర పుటల్లో నిలిచిపోయే విజయాన్ని కైవసం చేసుకున్నందుకు ఆస్ట్రేలియా జనసేన నాయకులు, జనసైనికులు మరియు వీరమహిళలు సంబరాలు జరుపుకున్నారు. ఈ విజయోత్సవ వేడుకకు ఆస్ట్రేలియా నలుమూలల నుండి సిడ్నీ నగరానికి జనసేన నాయకులు ఈ వేడుకకు హాజరవడం జరిగింది. సిడ్నీలో జరిగిన ఈ విజయోత్సవ వేడుకను జనసేన నాయకులు, జనసైనికులు మరియు వీరమహిళల మధ్య కేకును కట్ చేసి విజయోత్సాహాన్ని అందరూ పంచుకున్నారు. ఆస్ట్రేలియాలో ఉన్న తెలుగు జనసైనికుల పిల్లలు ఆటపాటలతో అందరినీ అలరించారు, ఒక యంగ్ కపుల్స్ డ్యాన్సులతో చిరంజీవి పాటలు, పవన్ కళ్యాణ్ పాటలతో స్టేజి దద్దరిలేలాగా, ఉత్సాహంగా డాన్సులు వేసి అందరి చేత ఈలలు, కేకలతో మంచి కనువిందు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పాటలు, జనసేన అధినేత స్పీచ్ లను ప్లే చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు వీడియో మెసేజ్ ద్వారా తమ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పది సంవత్సరాల కాలంలో ప్రతి ఒక్క జన సైనికుడు, వీర మహిళలు కష్టపడిన కష్టాన్ని, చేసిన సేవల్ని గుర్తించి ఒక అమూల్యమైన మెమొంటోతో సత్కరించుకున్నారు. గాజు గ్లాసు బహుమతిగా వచ్చిన ప్రతి ఒక్క జనసైనికుడికి వీర మహిళలకి ఈ విజయోత్సవ సభ గుర్తుగా ఒక గాజు గ్లాసు బహుమతిగా ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తాడెపల్లిగూడెం నియోజకవర్గ జనసేన పార్టీ ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, జూమ్ కాల్ ద్వారా హాజరయ్యి తమ అమూల్యమైన సందేశాన్నివ్వడం జరిగింది. తమలో ఉత్సహాన్ని నింపిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఈ సందర్భంగా జనసేన నాయకులు, జనసైనికులు మరియు వీరమహిళలు ఆస్ట్రేలియా జనసేన తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి మరో ముఖ్య అతిథి , శ్రీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ కాకినాడ పార్లమెంట్ సభ్యులు, జూమ్ కాల్ ద్వారా తమ సమూల్యమైన సందేశాన్ని మన జన సైనికులకు వీర మహిళలకు అందజేసి అందర్నీ ఉత్సాహపరిచారు. అందుకుగాను, తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ కి ఆస్ట్రేలియా జనసేన తరపున అందరూ ధన్యవాదాలు తెలిపారు. ఆస్ట్రేలియా జనసేన కన్వీనర్లలో ఒకరైన శశిధర్ కొలికొండ్ల ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఇండియా నుంచి జూమ్ కాల్ లో జన సైనికులను వీర మహిళలను ఉత్తేజ మరియు ఉత్సాహపరిచే విధంగా సందేశాన్ని ఇచ్చి మాట్లాడటం జరిగింది. రాబోయే రోజుల్లో ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ నాయకత్వంలో 100% ప్రజాసేవ చేసి, జనసేన పార్టీని బలోపేతం చేయాల్సిన బాధ్యత మనపై ఉందని జనసైనికుల్లో ఉత్తేజం నింపారు. ఇదే ఇన్స్పిరేషన్ తో మరింత కష్టపడి పనిచేస్తామని, కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికి మరియు జనసేన అధినేతను పిఠాపురంలో గెలిపించిన పిఠాపురం ప్రజలకు మరియొకసారి ధన్యవాదాలు తెలిపారు. జన సైనికుడి, వీర మహిళల స్థాయిని పెంచి, తమకంటూ ఒక ఉన్నత స్థానాన్ని ఇచ్చి, గెలుపుకి ఒక రాజ మార్గము వేసి, ఎలా కష్టపడాలో, ఎలాంటి భావాలు కలిగి ఉండాలో ఆదర్శవంతంగా యువతకి చూపించి అదే మార్గంలో నడిచి విజయకేతనం ఎగురవేసి చరిత్రపుటల్ని రాజకీయ విశ్లేషకుల ఊహకు అందని విజయకేతనాన్ని ఎగరవేసి రాబోయే తరాల వాళ్ళకి ఒక రోల్ మోడల్ గా నిలిచిన జనసేన అధినేత, డిప్యూటీ సిఎం కొణిదల పవన్ కళ్యాణ్ కి ఈ విజయోత్సవ సభ ద్వారా జనసేన ఆస్ట్రేలియా తరపున శుభాకాంక్షలు, శుభాభినందనలు తెలిపారు. యాంకర్లు అర్చన, శాంతి, వాలంటీర్లు మరియు ప్రదర్శకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. చివరిగా ఆస్ట్రేలియా జనసేనను ఇప్పటిదాకా ముందుండి నడిపించిన రవి మిర్యాల ని మేనేజ్మెంట్ వారు శాలువాతో సత్కరించుకున్నారు. ఈ విజయోత్సవ సంబరాలు జరుపుకుంటున్న సభకు విచ్చేసిన జన సైనికులకు, వీర మహిళలకు జనసేన నాయకులకు, ఎన్నారై టిడిపి కార్యకర్తలకు, టిడిపి నాయకులకు మరియు బిజెపి నాయకులకు, బిజెపి కార్యకర్తలకు జనసేన ఆస్ట్రేలియా తరపున ధన్యవాదాలు తెలిపారు. జనసేన 2024వ సంవత్సర విక్టరీ సెలబ్రేషన్స్ లో పాల్గొని విజయవంతం చేసిన జనసైనికులకు , వీర మహిళలకు జనసేన ఆస్ట్రేలియా తరపున మేనేజ్మెంట్ వారు రవి మిరియాల, రాజేష్ మల్ల, గాజుల మురహరి నాయుడు, కిషోర్ రంగా, పవన్ వజుల, జగదీష్ హరిదాస్ ధన్యవాదాలు తెలిపారు. జనసేనకు వెన్నుదన్నుగా నిలుస్తున్న సితార బిర్యానీ పాయింట్, నీవి హొమ్స్, సనత్ సర్వీసెస్, అమ్మ పిండి వంటలు, స్వాగత్ బిర్యానీ హౌస్, రాజా ఎలమంచి టాక్స్ కన్సల్టెంట్, వెంకట కండిపూడి టాక్స్ కన్సల్టెంట్, ఆర్వెస్సీస్, మాన్ విజన్, వారాహి మ్యాంగోస్, ఏ వన్ ఎఫ్ సర్వీసెస్, పావని, ఎన్రిచ్ ఐటి, ప్రోగ్రెస్ ఐటీ వంటి స్పాన్సర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## రేషన్ డీలర్లు ఇంటి వద్దనే సరుకులు పంపిణీ చేయాలి




ప్రొద్దుటూరు, సూర్య వాస్తవం: ప్రజలకు రేషన్ షాప్ డీలర్లు సరుకులను ఇంటి వద్దనే పంపిణీ చేయాలని కౌన్సిలర్ ఇర్ఫాన్ భాష కోరారు. బుధవారం స్థానిక 13వ వార్డులోని ఆయన కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ పట్టణంలోని కొన్ని వార్డులలో రేషన్ షాప్ డీలర్లు తమ షాపుల వద్దకే ప్రజలు రేషన్ కోసం రావాలని ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని, చాలామంది పేదవారు, వృద్ధులు రేషన్ షాపు వద్దకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారన్నారని వివరించారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి అవినీతి రహిత పట్టణంగా చేస్తానని చెప్తూ ఉంటే ఇలాంటి కొంతమంది వ్యక్తులు ఆయనకు చెడ్డపేరు తెచ్చేలా పనిచేస్తున్నారన్నారు. వీటన్నింటినీ త్వరలోనే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తానన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ పంపిణీతో సంబంధం లేని ఒక వ్యక్తి డీలర్లకు ఫోన్ చేసి బెదిరించడం ఏమిటని ప్రశ్నించారు. డీలర్లతో ఏవైనా పని ఉంటే ఆఫీస్ కు పిలిపించుకోవాలని అధికారులు వారి ఇంటి వద్దకు వెళ్లడం విడ్డూరంగా వుందన్నారు. ఈ సమస్యలన్నింటినీ ఆర్డీవో, జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తానన్నారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఈ సమస్యలపై దృష్టి సారించాలని కోరారు.

## ఇటువంటి సంఘటనలు జరుగుతాయి కానీ మోడీ సమాధానం ఇవ్వరు



ఉత్తర్ ప్రదేశ్, సూర్య వాస్తవం: థ్రాస్‌లో తొక్కిసలాటపై బిజెపిని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా బుధవారం తీవ్రంగా విమర్శించారు. అటువంటి సంఘటనలు సంభవిస్తూనే ఉంటాయని, కానీ జవాబుదారీని ప్రభుత్వం నిర్ధారించడం లేదని, ఆ పని చేయడానికి బదులు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నదని ప్రియాంక ఆరోపించారు. మూడింతల మంది జనాన్ని అనుమతించారు, అధికార యంత్రాంగం అక్కడ లేదు, జనాన్ని అదుపు చేసేందుకు ఏర్పాట్లు లేవు, మండే ఎండ నుంచి తప్పించుకునే మార్గం లేదు, వైద్య బృందం లేదు, సంఘటన తరువాత అంబులెన్స్ లేదు, సాయపడేందుకు ఎవరూ లేరు, ఆసుపత్రిలో వైద్యులు లేరు, సౌకర్యాలు లేవు. ఇది నిర్లక్షానికి చాంతాడు జాబితా, కానీ ఎవరూ జవాబుదారీ కాదు’ అని ప్రియాంక ‘ఎక్స్’లో హిందీ పోస్ట్‌లో విమర్శించారు. చర్య తీసుకోవలసిన బాధ్యత ప్రభుత్వానిది అని, అటువంటి సంఘటనల నివారణకు ఒక ప్లాన్ రూపొందించాలని ప్రియాంక కోరారు.

## సూర్య స్టాక్ మార్కెట్



న్యూఢిల్లీ **జూలై** 3 (సూర్య వాస్తవం) : దేశీయ స్టాక్ మార్కెట్లు సరికొత్త రికార్డులను సృష్టించాయి. కీలక బెంచ్‌మార్క్ సెన్సెక్స్ చరిత్రలో తొలిసారిగా 80,000 మైలురాయిని చేరుకుంది. సైతం 24,309 వద్ద ఆల్‌టైమ్ హై స్థాయిని తాకింది. బుధవారం ట్రేడింగ్‌లో కీలక బ్యాంకింగ్ రంగ షేర్లలో కొనుగోళ్లతో పాటు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి లభించిన మద్దతుతో సూచీలు రికార్డు గరిష్ఠాలను సాధించాయి. అయితే, చివరి అరగంటలో మదుపర్లు లాభాల స్వీకరణకు ఆసక్తి చూపడంతో సెన్సెక్స్ కీలక 80 మార్క్ నుంచి వెనక్కి తగ్గాయి. ప్రధానంగా భారతీయ బ్యాంకుల ఎన్‌పీఏలు 12 ఏళ్ల కనిష్ఠానికి తగ్గడం, సమీప కాలంలో బ్యాంకింగ్ రంగం పనితీరుపై సానుకూల అంచనాలు, అంతర్జాతీయంగా ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడం వంటి అంశాలు ర్యాలీకి కారణమయ్యాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. దీంతో మార్కెట్లు ముగిసే సమయానికి సెన్సెక్స్ 545.35 పాయింట్లు ఎగసి 79,986 వద్ద, నిఫ్టీ 162.65 పాయింట్లు లాభపడి 24,286 వద్ద ముగిశాయి. నిఫ్టీలో మీడియా మినహా అన్ని రంగాలు ఊపందుకున్నాయి. సెన్సెక్స్ ఇండెక్స్‌లో అదానీ పోర్ట్స్, కోటక్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఎస్‌బీఐ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ కంపెనీల షేర్లు అధిక లాభాలను సాధించాయి. టీసీఎస్, టైటాన్, రిలయన్స్, టాటా మోటార్స్, ఎల్అండ్‌టీ స్టాక్స్ నష్టాలను నమోదుచేశాయి. అమెరికా డాలరుతో రూపాయి మారకం విలువ రూ. 83.51 వద్ద ఉంది.

Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.com
అమరావతి
గుంటూరు, ఉమ్మడి కృష్ణా

# ఆంధ్రప్రదేశ్ టెట్, మెగా డీఎస్సీపై ప్రభుత్వం కీలక నిర్ణయం



**అమరావతి జూలై** 3 (సూర్య వాస్తవం) : ఆంధ్రప్రదేశ్‌లో టెట్, మెగా డీఎస్సీ పరీక్షలకు సంబంధించి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు అభ్యర్థులకు సమయమివ్వాలని నిర్ణయించింది. అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. త్వరలోనే టెట్, డీఎస్సీ పరీక్షల తేదీలను ప్రకటించనుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఈ మొత్తం ప్రక్రియ 6 నెలల్లో పూర్తిచేసేలా కార్యాచరణ రూపొందించాలని మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. కొత్తగా బీఈడీ, డీఎడ్ పూర్తి చేసుకున్న వారికీ మెగా డీఎస్సీలో అవకాశం కల్పించనున్నారు. టెట్, మెగా డీఎస్సీ పరీక్షలకు సన్నద్ధమ య్యేందుకు మరింత సమయం కావాలని విద్యార్థి, యువజన సంఘాల నేతలు, పలువురు ఎమ్మెల్సీలు లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రిపరేషన్‌కు సమయం ఇస్తే బాగుంటుందని కోరడంతో వారి విజ్ఞప్తుల్ని పరిశీలించిన ఆయన.. విద్యాశాఖ ఉన్నతాధికారులతో సమీక్షించారు. అభ్యర్థులకు టెట్‌కు 90 రోజులు, మెగా డీఎస్సీకి 90 రోజుల సమయం ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. కొత్త తేదీలను త్వరలోనే ప్రకటించనున్నట్లు అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి. మొత్తంగా ఈ ఏడాది డిసెంబర్‌లోగా ఉద్యోగాల భర్తీ ప్రక్రియను పూర్తి చేసి 2025 జనవరి నాటికి ఉద్యోగాలు ఇచ్చేలా కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను మంత్రి లోకేశ్ ఆదేశించినట్లు సమాచారం.

# రాష్ట్రంలోనే అతిపెద్ద పారిశ్రామిక వాడలు తీర్చిదిద్దుతాం-పరిశ్రమల మంత్రి టీజీ భరత్

**గన్నవరం/బాపులపాడు జూలై** 3 (సూర్య వాస్తవం) : మల్లవల్లి, వీరపనేనిగూడెం పారిశ్రామిక వాడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని, అతిపెద్ద పారిశ్రామిక వాడలుగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖామంత్రి టీజీ భరత్ అన్నారు. బుధవారం మంత్రి గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఏపీఐఐసీ, పరిశ్రమల శాఖ, రెవెన్యూ అధికారులతో కలిసి గన్నవరం మండలం మల్లవల్లి, బాపులపాడు మండలం వీరపనేని గూడెం పారిశ్రామిక వాడలను సందర్శించి పారిశ్రామికవేత్తలతో సమావేశమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ ఈ రెండు పారిశ్రామిక వాడల్లో విద్యుత్తు కోతల వల్ల ఆయా పరిశ్రమల్లో ఉత్పత్తికి ఆటంకం కలుగుతున్నదని, తద్వారా నష్టం వాటిల్లుతున్నదని పారిశ్రామికవేత్తలు మంత్రికి వివరించారు. వెంటనే మంత్రి విద్యుత్ అధికారులను పిలిచి సమస్య కారణాలు అడిగి తెలుసుకున్నారు. సబ్ స్టేషన్లో సిబ్బంది కొరత సమస్య పరిష్కరించాలని, విద్యుత్తు నిర్వహణ పక్కాగా నిర్వహించి కోతలు లేకుండా చూడాలని ఆదేశించారు. విద్యుత్ సమస్య పునరావృతం కారాదని హెచ్చరించారు. పరిశ్రమలకు విద్యుత్తు సరఫరా చాలా ముఖ్యమని పారిశ్రామికవేత్తగా పరిశ్రమ దారుల సమస్యలు తనకు తెలుసని అన్నారు. అశోక్ లేలాండ్ వంటి పెద్ద పారిశ్రామిక బ్రాండెడ్ సంస్థలు వస్తున్నాయని తెలిపారు. పారిశ్రామి వాడలలో బస్సు షెల్టర్, పోలీస్ పికెట్ వంటి కనీస వసతులు లేకపోవడం శోచనీయమని, వెంటనే ఏర్పాటు చేయాలని పారిశ్రామికవేత్తలను భాగస్వామ్యం చేయాలని అన్నారు. నీటి సమస్య పరిష్కరించాల న్నారు. ఏపీని అభివృద్ధి రోల్ మోడల్ గా చేయాలని ముఖ్యమంత్రి సంకల్పం అన్నారు. మల్లవల్లి, వీరపనేని గూడెం పారిశ్రామిక వాడల గుర్తింపునకు ప్రవేశ ద్వారాలను నిర్మించాలని, సెక్యూరిటీ ఏర్పాటు చేయాలని, పారిశ్రామిక వాడల చుట్టూ కంచె/ ప్రహరీ నిర్మించాలని, డ్రైనేజీ వ్యవస్థ పక్కాగా ఏర్పాటు చేయాలని, గ్రీన్ జోన్ ఏర్పాటు చేసి గ్రీనరీ అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ కు, అధికారులకు సూచించారు. గన్నవరం శాసనసభ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ మల్లవల్లి పారిశ్రామిక వాడ ముఖ్యమంత్రి, పరిశ్రమల మంత్రి సహకారంతో రాష్ట్రంలోనే అతిపెద్ద పారిశ్రామిక వాడగా తీర్చిదిద్దేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ పారిశ్రామిక వాడల్లో భూ సమస్యలు కనీస వసతుల కల్పన, తదితర అంశాలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మంత్రి, శాసనసభ్యులు జిల్లా కలెక్టర్ అశోక్ లేలాండ్ ప్రతినిధులతో కలిసి అశోక్ లేలాండ్ లేఔట్ సందర్శించారు. గుడివాడ ఆర్డిఓ పి పద్మావతి, ఏపీఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వివేక్, జోనల్ మేనేజర్ సీతారాం, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఆర్ వెంకట్రావు, విద్యుత్తు ఆర్డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

## జగ్గయ్యపేట ఆర్టీసీ డిపోలోని హైర్ బస్సులను నిలిపిన యజమానులు

జగ్గయ్యపేట , సూర్య వాస్తవం : ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణం లోని ఆర్టీసీ హైర్ బస్ ల యజమానులు బుధవారము నిలిపివేశారు. ఉదయము నుండి ఆర్టీసీ బస్టాండ్ కి బస్సులు రాక ప్రయాణికులు అవస్థ పడ్డారు. ఆర్టీసీ డిఎం హైర్ బస్ యజమానులను పిలిపించి చర్చలు జరిపారు. గత వారం రోజులుగా చర్చలు కొనసాగుతున్నయని గత రాత్రి బస్సు టైమింగ్స్ మార్చారని, బస్సు యజమానులు తెలియజేశారు. విజయవాడకు చెందిన హైర్ బస్ యజమానికి ప్రత్యేక సడలింపులు





ఇచ్చారని వారి బస్సులకి వరుస క్రమంలో టైమింగ్ ఇచ్చారని జగ్గయ్యపేటలోని యజమానులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా నిర్ణయం తీసుకున్నారని తెలియజేశారు. కావున బుధవారము బస్సులు ఆపారని హైర్ బస్ యజమానులు తెలియజేశారు. డిఎం మరియు ఆర్ఎంతో ఉదయము చర్చల అనంతరం తాత్కాలికంగా స్పందించి సమ్మె విరమించి బస్సులను నడిపారు. జగ్గయ్యపేట హైర్ బస్ యజమానులను ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

# రాష్ట్రంలో గంజాయి నియంత్రకు మంత్రుల సబ్ కమిటీ

అమరావతి, **జూలై** 3 (సూర్య వాస్తవం) : రాష్ట్రంలో గంజాయి, ఇతర మాధక ద్రవ్యాల నియంత్రణకు మంత్రుల సబ్ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రాష్ట్ర హోమ్ మరియు విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన ఏర్పాటు చేయబడిన ఈ సబ్ కమిటీలో రాష్ట్ర మానవ వరుల అభివృద్ధి, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంధ్ర, రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మరియు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి సభ్యులుగా ఉన్నారు. ఈ సబ్ కమిటీ తొలి సమావేశం 4 వ తేదీ గురువారం రాష్ట్ర సచివాలయం ఐదో బ్లాక్ మొదటి అంతస్తులో ఉదయం 11.00 గంటల నుండి జరుగనుంది. ఈ సమావేశంలో రాష్ట్ర డీజీపీ, సిఐడి, ఇంటెలిజెన్సు అదనపు డీజీలు మరియు సెబ్ డైరెక్టర్ పాల్గొంటున్నారు. రాష్ట్రంలో గంజాయి, ఇతర మాధక ద్రవ్యాల నియంత్రణకు తీసుకోవాల్సిన పటిష్టమైన చర్యలపై మంత్రుల సబ్ కమిటీని ఈ సమావేశంలో చర్చించనుంది.

# సీజనల్ వ్యాధుల నివారణపై సీఎం చంద్రబాబు సమీక్ష

**అమరావతి జూలై** 3 (సూర్య వాస్తవం) : రాష్ట్రంలో వ్యవస్థలన్నీ గాడి తప్పాయని...5 ఏళ్ల విధ్వంసానికి ప్రజలు బలవుతున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. సీజనల్ వ్యాధులపై సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష చేశారు. వైద్య ఆరోగ్య శాఖతో పాటు మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఈ సమీక్షకు హాజరయ్యారు. సీజనల్ వ్యాధుల విషయంలో ముందు నుంచే అధికారులు చర్యలు తీసుకోవాలని....ఇప్పుడు చర్యలకు దిగితే పూర్తి ఫలితాలు రావని సీఎం అన్నారు. ఆయా శాఖల్లో 2014 నుంచి 2019 వరకు నాటి టీడీపీ పాలనలో అనుసరించిన ఉత్తమ విధానాలు (బెస్ట్ ప్రాక్టీసెస్) అన్నీ మళ్లీ అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. సచివాలయంలో బుధవారం జరిగిన సమీక్షలో సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకున్న చర్యలపై అధికారులు సిఎంకు వివరించారు. మలేరియా, డెంగ్యూ నివారణకు కార్యాచరణ అమలు చేస్తున్నామని....ఫీవర్ కేసులు ఎప్పటికప్పుడు మానిటర్ చేస్తున్నామని, హైరిస్క్ కేసులపై ప్రత్యేక ఫోకస్ పెట్టామని అధికారులు వివరించారు. డెంగ్యూ, చికెన్ గున్యాకు ర్యాపిడ్ టెస్ట్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉందని అన్నారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు రాష్ట్రంలో 60 దయారియా కేసులు నమోదయ్యాయని. ప్రస్తుతం 6 గ్రామాల్లో 35 దయేరియా యాక్టివ్ కేసులు ఉన్నాయని అన్నారు. ఈ సీజన్ లో 9 మంది దయేరియాతో చనిపోయారని వివరించారు. కలుషిత తాగునీరు వల్లే వీరంతా దయేరియా బారిన పడి చనిపోయారని అధికారులు వివరించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ....గ్రామాలు, పట్టణాల్లో కలుషిత తాగునీరు, పారిశుధ్య లోపం, దోమల నివారణకు చర్యలు తీసుకోకపోవడం వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారని...వాటిపై ఇప్పటికే తగు ముందస్తు చర్యలు తీసుకోవాల్సిందని సీఎం అభిప్రాయపడ్డారు. సురక్షితమైన తాగునీరు, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో సీజనల్ వ్యాధుల బారిన పడే వారి సంఖ్య అధికంగా ఉంటుందని..వారిపై వైద్య, ఆరోగ్య శాఖ మరింత దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. అన్ని చోట్లా వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయని...కనీసం తాగునీటి పరీక్షలూ జరపడం లేదని సీఎం వ్యాఖ్యానించారు. నాటి తెలుగుదేశం ప్రభుత్వంలో గ్రామాల్లో వాటర్ హెడ్ ట్యాంకుల క్లీనింగ్, క్లోరినేషన్ పనులు పక్కాగా జరిగేవని....నేడు మళ్లీ నాటి బెస్ట్ ప్రాక్టీసెస్ పునరుద్ధరించాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడితే మాత్రం ఉపేక్షించేది లేదని సీఎం హెచ్చరించారు. డెంగ్యూ వస్తే వైద్యానికి లక్షల్లో ఖర్చు అవ్వడంతో పాటు కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, వారి జీవితాలు తల్లకిందులు అవుతున్నాయని సిఎం అన్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ వాటర్ క్వాలిటీ చెకింగ్ ల్యాబ్ కు కేవలం రూ.14 లక్షలు చెల్లించకపోవడంతో సేవలు నిలిచిపోయాయని, విషయం తెలిసి ఇప్పుడు బకాయిలు చెల్లించి సేవలు అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. సీజనల్ వ్యాధుల నివారణలో మూడు శాఖలు సమన్వయంతో పనిచేయాలని, అప్పుడే ఫలితాలు వస్తాయని సీఎం సూచించారు. మూడు శాఖల మంత్రులు, అధికారులు దీనిపై ప్రత్యేకంగా సమావేశం పెట్టుకుని కార్యాచరణతో ముందుకు వెళ్లాలని చంద్రబాబు ఆదేశించారు. పారిశుధ్య పనులు చేపట్టడం, నిరంతర ఫాగింగ్, సురక్షిత తాగునీరు అందిస్తే చాలా వరకు సీజనల్ వ్యాధుల సమస్య పరిష్కారం అవుతుందని సీఎం అన్నారు. అధికారులు, శాఖల పనితీరు ఫలితాలు కనిపించేలా ఉండాలని ముఖ్యమంత్రి అన్నారు. ఈ సమీక్షలో మంత్రులు నారాయణ, సత్యకుమార్ యాదవ్, మూడు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## టిడిపి నేతల కుటుంబ సభ్యులను పరామర్శించిన శాసనసభ్యులు తంగిరాల






నందిగామ,సూర్య వాస్తవం: నందిగామ పట్టణంలో తెలుగుదేశం పార్టీ నేతల కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పరామర్శించారు. కోమటి వీరయ్య భార్య ఇటీవల కాలంలో అకాల మరణం చెందిగా వారి స్వగృహమునందు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం వివిధ అనారోగ్య కారణాలతో బాధపడుతున్న అన్నం బుచ్చిబాబు , సోలా వెంకటేశ్వరరావు (వారి సతీమణి) తొర్లికొండ వెంకట్రావు , గన్నవరపు అప్పారావు లను వారి వారి స్వగృహముల నందు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిలను అడిగి తెలుసుకుని, త్వరితగతిన కోలుకుంటారని మనోధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక పట్టణ పార్టీ నేతలు పాల్గొన్నారు.

## గుంటుపల్లి సీఏ కన్వెన్షన్ వద్ద కారు బోల్తా



ఇబ్రహీంపట్నం, సూర్య వాస్తవం: స్థానిక సి ఏ కన్వెన్షన్ వద్ద రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది.ముందు వెళ్తున్న బస్సును ఢీకొని డివైడర్ పైకి దూసుకెళ్లి కారు బోల్తా పడింది. ఇబ్రహీంపట్నం వైపు నుంచి విజయవాడ వెళ్తుండగా ప్రమాదం జరిగింది. అదృష్టవశాత్తు కారులో ఉన్న వారికి ప్రాణాపాయం తప్పింది.

# ఎత్తివేసిన పాత పంటల భీమా పథకం మళ్లీ కొనసాగిస్తాం



అమరావతీ, సూర్య వాస్తవం: రైతులకు టీడీపీ చీఫ్, సీఎం చంద్రబాబు మరో మంచి వార్త చెప్పారు. వ్యవసాయ, జలవనరుల శాఖలపై సీఎం చంద్రబాబు బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఖరీఫ్ సీజన్ పంటల ప్రణాళిక, సాగునీటి విడుదలపై రెండు శాఖల మంత్రులు, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సాగునీటి కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్వహణను గాలికి వదిలేసిందని.. వ్యవస్థలు అన్నీ మళ్లీ గాడిన పడాలని సూచించారు. ప్రభుత్వ సాయం, సబ్సిడీలతో రైతులకు సాగు ఖర్చు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గత వైసీపీ ప్రభుత్వం ఎత్తేసిన పాత పంటల బీమా విధానాన్ని మళ్లీ తీసుకొస్తామని ఈ సందర్భంగా చంద్రబాబు రైతులకు శుభవార్త చెప్పారు. కాగా, ప్రకృతి వైపరీత్యాలు, వర్షాలు, ఇతర కారణాల వల్ల పంట నష్టపోతే.. పంటల బీమా విధానం కింద రైతులకు ప్రభుత్వమే ఆర్థిక సహాయం అందిస్తోంది. ఈ విధానాన్నే మళ్లీ అమల్లోకి తీసుకొస్తామని తాజాగా చంద్రబాబు అనౌన్స్ చేశారు. సీఎం నిర్ణయం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## రాజధాని మార్పు జరిగితే ఏమవుతుందో

మొదటి పేజీ తరువాయి

ఫలితాల అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పాటై, మళ్ళీ అమరావతీ ఊపిరి పోసుకుందనీ చెప్పాలి. ముఖ్యమంత్రిగా భాద్యతలు స్వీకరించిన మరుక్షణం నుండి చంద్రబాబు నాయుడు అమరావతి నిర్మాణం పైన ప్రతేక శ్రద్ధను కనబరుస్తున్నారు. తాజాగా అమరావతి నిర్మాణ ఖర్చుల పైన, ఇప్పటి వరకు జరిగిన పనుల పైన శ్వేత పత్రాన్ని విడుదల చేసారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ– అమరావతి అనేది ఆ కాలంలో ప్రముఖ నగరం – లండన్ మ్యూజియంలో ఉన్న అమరావతి శిల్ప సంపద వీడియో ప్రసారం – లండన్ మ్యూజియంలో అమరావతికి ఒక గ్యాలరీ పెట్టారు – ప్రతి గ్రామం నుంచి మట్టి, నీరు తెచ్చి అమరావతిలో ఉంచాం – దేశంలోని ప్రముఖ దేవాలయాల పవిత్ర జలం, మట్టి తెచ్చాం – ఆ పవిత్ర జలం. మట్టి మహిమ అమరావతిలో ఉంది – యమునా నది నీరు, పార్లమెంటు మట్టిని మోదీ తెచ్చారు – అమరావతికి మళ్లీ బ్రాండ్ ఇమేజ్ ఎలా తేవాలనే ఆలోచిస్తున్నాం – ఇప్పుడు పెట్టుబడిదారులను రప్పించాలంటే చాలా కష్టపడాలి – మళ్లీ ఇబ్బందులు రావని భరోసా ఏమిటని అడుగుతున్నారు? – ఈ శిథిలాల నుంచే బంగారు భవిష్యతుకు నాంది పలుకుతాం – ఇక్కడ సంపద సృష్టి, ఉపాధి కల్పన, పేదరిక నిర్మూలన జరగాలి – అమరావతిలో అభివృద్ధి కొనసాగితే భూమి రేట్లు బాగా పెరిగేవి – రూ.50 వేల కోట్లు ఖర్చు పెడతామని నిర్ణయించాం – పన్నుల రూపంలో ప్రభుత్వానికి తిరిగి నిధులు వచ్చేస్తాయి – విట్, ఎస్ఆర్ఎం వస్తే పేదపిల్లలు ఇక్కడే చదువుకునేవారు – కల్చరల్, నాలెడ్జ్ పంచుకుంటేనే రాష్ట్ర ప్రగతి సాధ్యం – విశ్వసనీయత దెబ్బతిని పెట్టుబడిదారులు వెనక్కి వెళ్లిపోయారు – అమరావతిలో మళ్లీ పనులు ప్రారంభమయ్యాయి – అమరావతిలో పనులను అంచెలంచెలుగా పూర్తి చేస్తాం – కేసులు ఎదుర్కొంటున్న అమరావతి రైతులకు న్యాయం చేస్తాం – రాజధానిని మార్చిన వ్యక్తి గతంలో ఎవరూ లేరు – రాజధాని మార్పు జరిగితే ఏమవుతుందో..దేశానికిది కేస్ స్టడీ. అని చంద్రబాబు అన్నారు. ప్రజలు తమకు ఇచ్చిన బాధ్యతను నెరవేర్చే క్రమంలో ఏం జరిగినా వెనక్కి చూడ కుండా ముందుకే వెళ్తా అని అన్నారు. న్యాయపరమైన చిక్కులు తొలగించి పనులు శరవేగంగా పూర్తి చేస్తాం అని వెల్లడించారు.

## ఉచిత ఇసుక విధానం అమలు

తీవ్రంగా నష్టపోయారని, దీంతో గృహ నిర్మాణ రంగం పూర్తిగా కుదేలయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని మార్చేందుకు తక్షణమే ఇసుక ధరలు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. దీనిలో భాగంగా రీచ్‌లు, స్టాక్‌పాయింట్లు, డంప్‌ల పరిధిలో ఎంత ఇసుక అందుబాటులో ఉందని అధికారులను సీఎం ప్రశ్నించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 40 లక్షల టన్నుల ఇసుక అందుబాటులో ఉందని అధికారులు వెల్లడించారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు బుధవారం సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో పలు అంశాలపై అధికారులతో చర్చించారు. దీనిలో భాగంగా ఖరీఫ్ సీజన్ కార్యాచరణతోపాటు నకిలీ విత్తనాల విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

## మళ్ళీ వాయిదాపడ్డ ప్రజావేదిక కార్యక్రమం

అమరావతీ, సూర్య వాస్తవం: ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ శనివారం అంటే 6 వ తేదీన నిర్వహించనున్న ప్రజా వేదిక కార్యక్రమం వాయిదా పడింది. గుంటూరు జిల్లా మంగళగిరి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రతి శనివారం ప్రజా సమస్యలు వినడంతో పాటు వినతులు స్వీకరించాల్సిన నిర్ణయించుకున్న సంగతి తెలిసిందే. వేదిక పేరుతో ఇప్పటికే రెండు శనివారాలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా ఈసారి మాత్రం అనూహ్యంగా వాయిదా పడింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటన, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో భేటీ నేపథ్యంలో శనివారం ప్రజా వినతులను స్వీకరించడంలేదని పార్టీ నాయకులు ప్రకటించారు. ఈ శనివారం కాకుండా పై వచ్చే వారంలో సీఎం చంద్రబాబు నాయుడు ప్రజా వేదిక కార్యక్రమాన్ని కొనసాగించనున్నారని , ఈ నెల 6న తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి ప్రజలు రావొద్దని పిలుపునిచ్చారు. కాగా సీఎం చంద్రబాబు ఢిల్లీలో ప్రధాని మోడీతో పాటు పలువురు కేంద్రమంత్రులను రేపు కలవనున్నారు. గురువారం ఉదయం 10.30 గంటలకు ప్రధాని మోడీతో ఆ తర్వాత కేంద్రమంత్రులు అమిత్ షా, నిర్మలా సీతారామన్‌తో భేటీ కానున్నారు. అమరావతి, పోలవరం, ఏపీ ఆర్థిక పరిస్థితిపై ప్రధానితో పాటు కేంద్రమంత్రులకు సీఎం చంద్రబాబు నివేదిక అందించనున్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి, సూర్య వాస్తవం: గుంటూరు జిల్లా తెనాలి ప్రభుత్వ ఆసుపత్రిని మంత్రి నాదెండ్ల మనోహర్ సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెనాలి నుంచి గుంటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి రోగులను తరలించే పరిస్థితి ఇకపై ఉండకూడదన్నారు. కొన్ని సీరియస్ కేసులు గుంటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించటాన్ని తగ్గించాలని.. అందుకు అవసరమైన సాంకేతిక పరికరాలపై దృష్టి సారించాలని ఏం కావాలో తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.



# 3 నెలల్లో 1.28 లక్షల గృహాలను పూర్తి చేయాలి

- వచ్చే మార్చి నాటికి నిర్మాణంలో ఉన్న8.02 లక్షల గృహాలను పూర్తి చేస్తాం
- రాష్ట్ర గృహనిర్మాణ,సమాచార శాఖామాత్యులు కె.పార్ధ సారధి



అమరావతి జూలై 3 (సూర్య వాస్తవం) : రాష్ట్రంలో 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక కింద వచ్చే మూడు మాసాల్లో లక్షా 28వేల గృహాలను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్టు రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖామాత్యులు కె.పార్ధ సారధి వెల్లడించారు.ఈమేరకు బుధవారం రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖపై అన్ని జిల్లాల ప్రాజెక్టు డైరెక్టర్లు, ఎస్ఇ,ఇఇలు ఆశాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షించారు.అనంతరం రాష్ట్ర సచివాలయం నాల్గవ భవనంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు ఎన్.చంద్రబాబు నాయుడు అన్ని ప్రభుత్వ శాఖలు 100 రోజుల కార్యాచరణను రూపొందించుకోవాలన్న ఆదేశాలకు అనుగుణంగా గృహ నిర్మాణ శాఖకు సంబంధించి 100 రోజుల కార్యాచరణ కింద రానున్న మూడు మాసాల్లో 1.28 లక్షల గృహాలను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్టు పునరుద్ఘాటించారు.ఇందుకు గాను 2వేల 520 కోట్ల రూ.లన ఖర్చు చేయనున్నట్టు మంత్రి పార్ధసారధి తెలిపారు. అంతేగాక రాష్ట్రంలో వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న 8.02 లక్షల గృహాలను వచ్చే మార్చి నెలాఖరుకు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్టు మంత్రి పార్ధసారధి చెప్పారు.అదే విధంగా నిర్మాణ దశలో ఉన్న 6.08 లక్షల గృహాల స్టేజ్ కన్వర్సన్ చేయాలని నిర్ణయించినట్టు పేర్కొన్నారు.గృహ నిర్మాణాలు జరిగే లేఅవుట్ల అభివృద్ధికి సంబంధించి విశాఖపట్నం, విజయవాడ,నెల్లూరు,రాయల సీమల్లోని ధర్మల్ పవర్ స్టేషన్ల నుండి వచ్చే ఫ్లై యాష్ వినియోగించేందుకు చర్యలు తీసుకోనున్నట్టు మంత్రి పార్ధసారధి పేర్కొన్నారు.అదే విధంగా ఆప్సన్–3 కింద నిర్మాణంలో ఉన్న గృహాలకు సంబంధించిన సమస్యలపై ముఖ్యమంత్రి వర్యులతో మాట్లాడి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి వివరించారు. రాష్ట్రంలో వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న గృహాలను వేగవంతంగా పూర్తి చెయ్యటానికి అధికారులందరూ కృషి చెయ్యాలని ఆదేశించామని మంత్రి పార్ధ సారధి చెప్పారు.గృహ నిర్మాణాలకు సంబంధించి ఈనెలాఖరు లోగా రీకన్సిలేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు.అంతేగాక ఇకమీదట ప్రతి నెలా గృహ నిర్మాణాల ప్రగతిని అధికారులతో సమీక్షించడం జరుగుతుందని అన్నారు. అంతకు ముందు రాష్ట్ర సచివాలయం 5వ భవనంలో జరిగిన గృహ నిర్మాణశాఖ సమీక్షలో గృహనిర్మాణ,సమాచార శాఖ మంత్రి పార్ధసారధి మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలా కట్టుబడి ఉందని ఆదిశగా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అర్హులం దరికీ గృహాలు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వం ధృడ సంకల్పంతో ఉందని కావున గృహ నిర్మాణాలను వేగవతంగా పూర్తి చేసేందుకు క్షేత్ర స్థాయిలో అధికారులంతా చిత్తశుద్ధితో పనిచే యాలని మంత్రి ఆదేశించారు.ఈ సమావేశంలో ముఖ్యంగా 2015 లో ప్రారంభమైన ప్రధాన మంత్రి ఆవాస్ యోజన,(అర్బన్) పథకం క్రింద జిల్లాల్లో గృహ నిర్మాణాల ప్రగతిని, రాష్ట్ర వ్యాప్తంగా గృహ నిర్మాణాల వంద రోజుల ప్రణాళికపై నియోజక వర్గాల వారీగా మంత్రి సమీక్షించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవాలని కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.గృహ నిర్మాణ శాఖలో ఉన్న ఖాళీలను ప్రస్తావిస్తూ పదోన్నతుల ద్వారా ఖాళీలను భర్తీ చేయాలని,క్రింది స్థాయి ఖాళీలను జిల్లాల నుంచి లేదా డిప్యుటేషన్ ద్వారా భర్తీ చేయాలని ఉన్నతాధికారులకు సూచించారు.గృహ నిర్మాణ పథకాల అమలుకు సిబ్బంది కొరత లేకుండా చూడాలని మంత్రి పార్ధ సారధి అధికారులకు స్పష్టం చేశారు. ఈసమావేశంలో ఆశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్,ప్రత్యేక కార్యదర్శి మైదీన్ దివాన్, ఎండి గిరీషా, పిడిలు, ఎస్ఇలు, ఇఇలు తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఏపీ ఇంటలిజెన్స్ విభాగం చీఫ్‌గా మహేశ్ చంద్ర లడ్డా నియామకం



అమరావతి, సూర్య వాస్తవం: కేంద్ర సర్వీసుల డిప్యుటేషన్ పూర్తి చేసుకుని తిరిగొచ్చిన ఐపీఎస్ మహేశ్ చంద్ర లడ్డా వెంటనే ఆయన్ను ఇంటలిజెన్స్ చీఫ్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఏపీలోని పలు జిల్లాలు, హైదరాబాద్‌లో ఎస్పీ, డీసీపీగా పని చేసిన లడ్డా ప్రకాశం జిల్లా ఎస్పీగా ఉన్నప్పుడు మావోయిస్టుల దాడి నుంచి ప్రాణాలతో బయటపడ్డ వైనం ఏపీ ఇంటలిజెన్స్ చీఫ్‌గా ఐపీఎస్ అధికారి మహేశ్‌చంద్ర లడ్డా నియమితులయ్యారు. 1998 బ్యాచ్ అధికారి అయిన లడ్డాను కేంద్ర సర్వీసుల్లో డిప్యుటేషన్ ముగించుకుని మంగళవారం ఏపీ ప్రభుత్వానికి రిపోర్టు చేశారు. అనంతరం, ఆయనను నిఘా విభాగాధిపతిగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఐపీఎస్ మహేశ్ చంద్ర లడ్డా గతంలో గుంటూరు, ప్రకాశం, నిజామాబాద్ జిల్లాల్లో ఎస్పీగా పనిచేశారు. హైదరాబాద్ ఈస్ట్ జోన్ డీసీపీగా, జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏలో దాదాపు ఐదేళ్ల పాటు ఎస్పీగా, డీఐజీగా విధులు నిర్వర్తించారు. విజయవాడ నగర జాయింట్ పోలీస్ కమిషనర్‌గా, విశాఖ నగర పోలీస్ కమిషనర్‌గా, నిఘా విభాగంలో ఐజీగానూ చేశారు. 2019–20 మధ్య ఏపీ పోలీస్ పర్సనల్ విభాగం ఐజీగా పని చేసి కేంద్ర సర్వీసులకు డిప్యుటేషన్‌పై వెళ్లారు. అక్కడ సీఆర్పీఎఫ్‌లో ఐజీగా నాలుగేళ్ల పాటు పని చేసి తాజాగా ఏపీకి తిరిగొచ్చారు.

మావోయిస్టుల దాడి.. : ప్రకాశం జిల్లా ఎస్పీగా లడ్డా సేవలందిస్తున్న సమయంలో ఆయన ప్రయాణిస్తున్న వామనాన్ని మావోయిస్టులు క్లెమోర్‌మైన్స్‌తో పేల్చేశారు. అది బుల్లెట్ ప్రూఫ్ వాహనం కావడంతో లడ్డాతో పాటు ఆయన ఇద్దరు గన్‌మెన్లు, డ్రైవర్ ప్రాణాలతో బయటపడ్డారు. ఈ దుర్ఘటనలో ఇద్దరు పౌరులు మృతి చెందారు. అప్పట్లో ఈ ఉదంతం దేశ్యాప్తంగా కలకలం రేపింది.

## తిరుమలలో దళారుల ఏరివేతకు చర్యలు తీసుకోండి

### – టీటీడీ ఈవో శ్యామలరావు




తిరుమల, సూర్య వాస్తవం: తిరుమల శ్రీవారి భక్తులను మోసగిస్తున్న దళారులను కనిపెట్టి ఎప్పటికప్పుడు వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా టీటీడీ ఈవో జె.శ్యామలరావు జిల్లా ఎస్పీని కోరారు. తిరుపతి టీటీడీ పరిపాలనా భవనంలోని సమావేశ మందిరంలో బుధవారం ఉదయం జిల్లా పోలీస్, టీటీడీ నిఘా మరియు భద్రత విభాగం అధికారులతో ఈవో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ తిరుమల శ్రీవారి దర్శనానికి విచ్చేసే వేలాది మంది భక్తులకు అవసరమైన వసతి, దర్శనం, ఆర్జితసేవ టికెట్లకు సంబంధించి భక్తులను మోసగిస్తున్న అనేకమంది దళారులను ఉపేక్షించరాదన్నారు. వారిపై వెంట వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సివిఎస్ఓ వివరించిన ఆవశ్యకత మేరకు తిరుమలలో ఐటి అనుబంధంగా ఉన్న కేసులను సత్వరం పరిష్కరించేందుకు సైబర్ క్రైమ్ టీం ఏర్పాటు పరిశీలించవలసిందిగా సంబంధిత అధికారులకు ఈవో సూచించారు.అంతకుముందు పోలీస్ విభాగం వారు తిరుమలలో దర్శన దళారులకు సంబంధించి, ఆన్లైన్ ద్వారా, డిప్ సిస్టం ద్వారా, రిజిస్ట్రేషన్ చేసుకున్న కేసులు, దొంగతనం కేసులు, మద్యపానం, నకిలీ వెబ్సైట్లు, తదితర అంశాలకు సంబంధించిన కేసులు ఏఏ దశల్లో ఉన్నాయో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం ఈవో మాట్లాడుతూ మరో వారంలోపు ఈ కేసుల్లో ఉన్న దళారులకు చట్టపరంగా తగు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాల్సిందిగా పోలీస్ అధికారులను కోరారు. అంతేకాకుండా ఇటువంటి కేసుల సత్వర పరిష్కారం కోసం టీటీడీ విజిలెన్స్, పోలీస్ విభాగాలు తరచూ సమావేశం కావాలన్నారు.ఈ సమావేశంలో తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, టీటీడీ జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సివి అండ్ ఎస్ఓ నరసింహ కిషోర్, తిరుమల అదనపు ఎస్పీ విమల కుమారి, డిఎస్పి శ్రీనివాస ఆచారి, టీటీడీ విజివో (విజిలెన్స్) గిరిధర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అరెస్ట్ అయినా నిందితులను పరామర్శించిన వైసీపీ మాజీ మంత్రులు



మంగళగిరి, సూర్య వాస్తవం: గతంలో మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయంపై దాడి కేసులో ముద్దాయిలుగా ఉన్న ఐదుగురు వైసిపి కార్యకర్తలను మంగళగిరి రూరల్ పోలీసులు బుధవారం అరెస్టు చేసిన సంగతి విదితమే.పోలీసుల అదుపులో ఉన్న వైసిపి కార్యకర్తలను మాజీ మంత్రులు అంబటి రాంబాబు, మేరుగు నాగార్జున, నిమ్మకాయల రాజనారాయణ, కావటి మనోహర్ నాయుడు, దొంతిరెడ్డి వేమారెడ్డి, తదితర వైసిపి శ్రేణులు పరామర్శించారు. వైసిపి కార్యకర్తల అరెస్టుకు సంబంధించిన వివరాలను మంగళగిరి రూరల్ సిఐ శ్రీనివాసరావును వైసిపి నేతలు అడిగి తెలుసుకున్నారు.

## హజరత్ బడే మియా దర్గాలో మొక్కులు తీర్చుకున్న టీడీపీ శ్రేణులు



నందిగామ, సూర్య వాస్తవం: ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు నందిగామ నియోజకవర్గ ఎమ్మెల్యేగా తంగిరాల సౌమ్య విజయవాడ పార్లమెంటు సభ్యులుగా కేశినేని శివనాథ్ (చిన్ని) అత్యధిక మెజారిటీతో గెలిచి కూటమి ప్రభుత్వాన్ని ఏర్పరచిన సందర్భంగా నందిగామ నియోజకవర్గం చందర్లపాడు మండలం తుర్లపాడు టిడిపి నేత పొల్లా శ్రీనివాసరావు మొక్కులు చెల్లించుకున్నారు తుర్లపాడు హాజరత్ బడే మియా దర్గాలో 101 కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు తంగిరాల సౌమ్య మరియు మండల పార్టీ నేతలు పాల్గొన్నారు.

## వ్యవసాయ, వెటర్నరీ డిప్లొమో కోర్సులకు మంచి ఉపాధి అవకాశాలు

చిత్తూరు సూర్య వాస్తవం: వ్యవసాయ, వెటర్నరీ డిప్లొమో కోర్సులకు మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని చిత్తూరుజిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా బుధవారం ఉదయం చౌడేపల్లిలో వ్యవసాయ పాలిటెక్నిక్,సదుంలో వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ త్వరితగతిన ఉపాధి అవకాశాలు పొందేందుకు వ్యవసాయ, వెటర్నరీ డిప్లమా కోర్సులు తోడ్పడతాయని, ఈ ప్రాంతంలో వ్యవసాయ, వెటర్నరీ పాలి టెక్నిక్ కళాశాలల ఏర్పాటు ద్వారా చాలా మంది విద్యార్థులకు వ్యవసాయ,పశు ఆధారిత రంగాలపై ఆసక్తి ఉన్న వారందరూ ఈ కోర్సులను పూర్తి చేసి ఉపాధి అవకాశాలను ఏర్పరచుకోగలరన్నారు.

# కృష్ణంపల్లెలో సచివాలయ సిబ్బందికి, వాలంటీరకు వార్నింగ్ ఇచ్చిన ముక్కా వరలక్ష్మీ

Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.com
రాయలసీమ
కడప, అనంతపురం, చిత్తూరు



పుల్లంపేట, సూర్య వాస్తవం: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఒకటవ తేదీన 7,000 రూపాయలు చొప్పున పింఛన్ అందజేసిన విషయం అందరికీ తెలిసినదే అయితే ఈ కార్యక్రమంలో కృష్ణంపల్లి వాలంటీర్ సురేష్ అనే వ్యక్తి వృద్ధుల దగ్గర 200 రూపాయలు చొప్పున రాబట్టాడని, ఈ విషయము రైల్వే కోడూరు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ముక్కారూపానంద రెడ్డికి తెలియడంతో, ముక్కా వరలక్ష్మి చొరవు తీసుకుని కృష్ణం పల్లి గ్రామానికి వెళ్లి వారి డబ్బులు వారికి తిరిగి ఇప్పించడమే గాక, అటు సచివాలయ సిబ్బందికి, ఇటు వాలంటరీకి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఇకమీదట పుల్లంపేటలో ఎక్కడ కూడా అవకతవకలు జరిగినచో, లంచానికి పాల్పడినచో, ఎటువంటి అధికారులు కూడా క్షమించబోమని, వాలంటీర్లు ఎక్కడ ఏ కార్యక్రమంలో కనిపించినా క్షమించబోమని తెలియజేశారు. అధికారులందరూ ప్రజలందరికీ న్యాయం చేకూరేలా పనిచేయాలని హితావు పలికారఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు , ఎక్స్ మార్కెట్ కమిటీ చైర్మన్ నేలపాటి రామచంద్రయ్య నాయుడు, వేణుగోపాల్ రెడ్డి, చుండు ఈశ్వర నాయుడు, కుప్పాల రామకృష్ణ, కుప్పాల మల్లికార్జున, కొండేటి చెంగయ్య, యనమల సుబ్బయ్య,కటికం మణి మరియు తెలుగుదేశం జనసేన బిజెపి కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఒకటవ తేదీన 7,000 రూపాయలు చొప్పున పింఛన్ అందజేసిన విషయం అందరికీ తెలిసినదే అయితే ఈ కార్యక్రమంలో కృష్ణంపల్లి వాలంటీర్ సురేష్ అనే వ్యక్తి వృద్ధుల దగ్గర 200 రూపాయలు చొప్పున రాబట్టాడని, ఈ విషయము రైల్వే కోడూరు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ముక్కారూపానంద రెడ్డి కి తెలియడంతో, ముక్కా వరలక్ష్మి చొరవు తీసుకుని కృష్ణం పల్లి గ్రామానికి వెళ్లి వారి డబ్బులు వారికి తిరిగి ఇప్పించడమే గాక, అటు సచివాలయ సిబ్బందికి, ఇటు వాలంటరీకి గట్టిగా చెప్పడం జరిగింది. ఇకమీదట పుల్లంపేటలో ఎక్కడ కూడా అవకతవకలు జరిగినచో, లంచానికి పాల్పడినచో, ఎటువంటి అధికారులు కూడా క్షమించబోమని, వాలంటీర్లు ఎక్కడ ఏ కార్యక్రమంలో కనిపించినా క్షమించబోమని తెలియజేశారు. అధికారులందరూ ప్రజలందరికీ న్యాయం చేకూరేలా పనిచేయాలని హితావు పలికారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు , ఎక్స్ మార్కెట్ కమిటీ చైర్మన్ నేలపాటి రామచంద్రయ్య నాయుడు, వేణుగోపాల్ రెడ్డి, చుండు ఈశ్వర నాయుడు, కుప్పాల రామకృష్ణ, కుప్పాల మల్లికార్జున, కొండేటి చెంగయ్య, యనమల సుబ్బయ్య, కటికం మణి మరియు తెలుగుదేశం జనసేన బిజెపి కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కుప్పం ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

### - ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



కుప్పం , సూర్య వాస్తవం : కుప్పం నియోజకవర్గంలోని ఆర్టీసీ డిపో యాజమాన్యం, కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. బుధవారం ఆయన కుప్పం ఆర్టిసి డిపో కార్మికుల ఆహ్వానం మేరకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆర్టీసీ డిపోని పరిశీలించారు.అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని బస్టాండ్ లో కల్లా కుప్పం బస్టాండ్ ను రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతామని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కుప్పం ఆర్టీసీ డిపోపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. ఈ విషయమై ఇప్పటికే సీఎంఓ ఆఫీస్‌కు ముఖ్యమంత్రిఆదేశాలు జారీ చేశారని తెలిపారు. అంతేకాకుండాఆర్టీసీ కార్మికులు వారి సమస్యలు తమ దృష్టికి వస్తే పరిష్కరిస్తానని ఎమ్మెల్సీ కంచర్ల హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోపాటు మాజీ జెడ్పిటిసి కుప్పం మున్సిపాలిటీ టిడిపి అధ్యక్షుడు శేఖర్ రాజ్ కుమార్, కుప్పం మాజీ సర్పంచ్ పి గోపీనాథ్, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు సత్యేంద్ర శేఖర్, కుప్పం మున్సిపాలిటీ 19వ వార్డు కౌన్సిలర్ జాకీర్, శాంతిపురం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు, నేతలు వైద్యం శాంతారాం,ఆర్టీసీ యూనియన్ నాయకులు బలరాం, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలలో పట్టుబడ్డ అక్రమ మద్యాన్నిధ్వంసం చేసిన యస్ ఈబి పోలీస్‌లు



రాజంపేటడివిజన్, సూర్య వాస్తవం: అన్నమయ్యజిల్లా, రాజంపేట పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని నందలూరు, చిట్వేల్ రాజంపేట అర్బన్ పోలీసు స్టేషన్ ల పరిధిలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల లో పట్టుబడ్డ అక్రమ మద్యాన్ని బుధవారం అన్నమయ్య జిల్లా ఎస్పీ బి.క్రిష్ణారావు ఉత్తర్వులు మేరకు అడిషనల్ ఎస్పీ డాక్టర్ వి. బి రాజ్ కమల్, ఎస్సీబీ ఈ ఎస్ వి.శ్రీనివాసులు అద్వర్యంలో మద్యం బాటలను జెసిబి సహాయంతో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా అన్నమయ్య జిల్లా, రాజంపేట పోలీస్ సబ్ డివిజన్ లోని నందలూరు, చిట్వేల్ రాజంపేట అర్బన్ పోలీసు స్టేషన్ ల పరిధిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిపై దాడులు నిర్వహించి మొత్తం 27 కేసులు నమోదు చేశామని ఈ కేసులకు సంబంధించి మొత్తం 472 మద్యం బాటిల్లను సీజ్ చేశామని చెప్పారు. వీటి విలువ రూ. 71,753/- ల ఉంటుందని వివరించారు. సీజ్ చేసిన (114.66 లీటర్లు) మద్యం బాటిల్లను ఈరోజు నందలూరు మండలం ఆల్విన్స్ సమీపంలో ఎవరూ లేని ప్రదేశానికి తీసుకెళ్లి అక్కడ జెసిబి సహాయంతో ఆ బాటిల్లను ధ్వంసం చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నందలూరు, రాజంపేట, చిట్వేల్, పోలీస్ స్టేషన్ల యస్.ఐ.లు అబ్దుల్ జహీర్, వెంకటేశ్వర్లు సుధాకర్, నందలూరు ఏఎస్ఐ శంకర్ నాయక్, రాజంపేట ఎస్ బీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మైనింగ్ డైరెక్టర్ వెంకటరెడ్డి పైన సిఐడి లేదా సిబిఐ సంస్థ ద్వారా సమగ్ర విచారణ జరపాలి : పోతుగుంట రమేష్ నాయుడు



రాజంపేట డివిజన్, సూర్య వాస్తవం: రాజంపేటలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నంద్యాల జిల్లా ఇంచార్జ్ పోతు గుంట రమేష్ నాయుడు మాట్లాడుతూ మైనింగ్ శాఖ మైనింగ్ డైరెక్టర్ గా ఉన్నటువంటి వెంకట్ రెడ్డి హయాంలో రాష్ట్రంలో మైనింగ్ విచ్చలవిడిగా దోపిడీ జరిగిందని ముఖ్యంగా రాష్ట్రంలోని అన్ని నదుల్లో ఇసుకను తమ ఇష్టారాజ్యంగా వైఎస్ఆర్సిపి బడా నాయకులు దోచుపెట్టడమే కాకుండా తను కూడా విచ్చలవిడిగా అక్రమంగా సంపాదించాడు .ముఖ్యంగా అతన్ని మైనింగ్ డైరెక్టర్ గా వేసుకున్న ఉద్దేశం ఏమిటంటే మంగంపేటలో ముగ్గురాయిని దోచుకోవడానికి వారు వారిని డైరెక్టర్గా చేశారు వారి హయాంలో మంగంపేటలో ఏ గ్రేడ్ రాయిని బి గ్రేడ్ గా సీక్రెట్ గా చూపించి తన బినామీలకు వేలాది టన్నుల రాయి ఇచ్చి కోట్ల రూపాయల ప్రభుత్వ ధనాన్ని కొల్లగొట్టి వీరందరూ దాచుకున్నారని ఆ వచ్చిన డబ్బుని ఈమధ్య రాజంపేట రైల్వే కోడూరు ఎన్నికల్లో విచ్చలవిడిగా ఖర్చు పెట్టారని వీటన్నిటికీ వెనకన వెంకటరెడ్డి తో పాటు ఇంకా పెద్ద తలకాయలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి లాంటివాళ్ళు ఎంతో మంది ఉన్నారని ఈ పెద్ద స్కాం వేలాది కోట్ల రూపాయల ప్రభుత్వ ధనం నష్టపోవడమే కాకుండా వైసిపి నాయకులు చేతుల్లోకి మరియు వెంకటరెడ్డి చేతికి అందిందని కావున సమగ్ర విచారణ జరగాలంటే ఒక ప్రత్యేక అధికారిని నియమించి రాష్ట్ర పరిధిలో సిఐడి ద్వారా గాని లేదా సిబిఐ ద్వారా ఎంక్వైరీ చేయాలని బిజెపి డిమాండ్ చేస్తుంది. అలాగే దీని వెనక ఎంతటి వారున్నా వారందరినీ కూడా శిక్షించి ప్రభుత్వ ధోనాన్ని తిరిగి వారి దగ్గర నుంచి రాబట్టాలని ఈ సందర్భంగా బిజెపి డిమాండ్ చేస్తుంది. ఈ కార్యక్రమంలో బిజెపి ఓపిసి మోచ రాష్ట్ర అధికార ప్రతినిధులు పట్టపోగల ఆదినారాయణ బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శులు జీకే నాగరాజు మరియు రమణ బిజెపి పట్టణ కార్యదర్శి పెనుగొండ రమణ బీజేవైఎం మండల అధ్యక్షులు పత్తిపాటి నవీన్ కుమార్ ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షులు వేణుగోపాలచారి బిజెపి పార్లమెంట్ నాయకులు తోట నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.2.50 కోట్లతో వంజంగికి బీటీ రోడ్ నిర్మాణం

అల్లూరి సీతారామరాజు సూర్య వాస్తవం: అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రం వంజంగి హిల్స్ కు రూ. రెండు కోట్ల 50 లక్షలతో 3.5 కిలోమీటర్ల తారు రోడ్డు మంజూరు చేశామని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వి .అభిషేక్ వెల్లడించారు. బుధవారం అధికారులతో కలిసి వంజంగి హిల్స్ ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంజంగి నుండి కల్లాల బయలు వరకు తారు రోడ్డు నిర్మిస్తున్నామని చెప్పారు. రానున్న ఆరు నెలల్లో రోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారుల ఆదేశించారు. పర్యావరణానికి హాని కలవకుండా వ్యూ పాయింట్ వద్ద రైలింగ్ నిర్మించాలని చెప్పారు. పర్యాటకులకు సౌకర్యవంతంగా ఉండేలా నీటి సదుపాయంతో కంటైనర్ టాయిలెట్లు నిర్మించాలని స్పష్టం చేశారు. నిర్మాణంలో పటిష్టమైన నాణ్యతలు పాటించి నిర్దిష్టమైన గడువులోగా రోడ్డు పనులు పూర్తి చేయాలని పేర్కొన్నారు.

## అత్యధిక ప్యాకేజీకి ఎంపికైన శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి



అన్నమయ్య సూర్య వాస్తవం : అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబరిచి అత్యధిక వేతనానికి ఎంపికయ్యాడని కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం . సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన జి .విజయ్ కుమార్ ఆన్లైన్ విధానంలో బ్యాంకింగ్ వ్యవస్థకు చెందిన ఇంటర్న్షిప్ అవకాశాన్ని కళాశాల మౌలిక వసతులు మరియు అధ్యాపకుల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి దిగ్విజయంగా పూర్తి చేశాడు. ఈ విద్యార్థి ప్రతిభను గుర్తించిన జపాన్ దేశానికి చెందిన దిగ్గజ వ్యవస్థ అయిన సాఫ్ట్ బ్యాంకు సంస్థలో సంవత్సరానికి 32 లక్షల వేతనానికి ఎంపికయ్యాడని వివరించారు. ఈ సందర్భంగా కళాశాల కరెస్పాండెంట్ కే.పీ.వి సుబ్బయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ వి. బాలాజీ, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

### శ్రీ సత్యసాయి జిల్లా

## ఐసీడీఎస్ పీడీగా నాగమల్లీశ్వరి



శ్రీ సత్యసాయి జిల్లా, సూర్య వాస్తవం: స్త్రీ, శిశు సంక్షేమ శాఖ(ఐసీడీఎస్) శ్రీ సత్యసాయి జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్(పీడీ)గా నాఫమల్లేశ్వరి నియమితులయ్యారు. జిల్లాలో సీనియర్ సీడీపీఓ ఆమె ఒక్కరే కావడంతో పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు పీడీగా కొనసాగిన లక్ష్మీ కుమారి గత నెల 30న ఉద్యోగ విరమణ చేసిన సంగతి తెలిసిందే. ఖాళీ అయిన పీడీ స్థానానికి హిందూపురం సీడీపీఓ రెడ్డి రమణమ్మ, కడప జిల్లా కమలాపురం సీడీపీఓ వసంతబాయి తమ వంతు ప్రయత్నాలు చేశారు. అయితే మడకశిర సీడీపీఓగా కొనసాగుతున్న నాగమల్లేశ్వరి సీనియారిటీని దృష్టిలో పెట్టుకొని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ నాగమల్లేశ్వరికే అవకాశం కల్పించారని సమాచారం. బుధవారం పీడీగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన నాగమల్లేశ్వరిని సీడీపీఓలు, సూపర్ వైజర్లు, కార్యాలయ ఉద్యోగులు నాగమల్లేశ్వరిని కలసి పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అందరూ కలసి కట్టుగా పని చేసి, శాఖకు మంచి పేరు తీసుకువద్దామని పీడీ నాగమల్లేశ్వరి పిలుపునిచ్చారు.

## రాష్ట్ర ముతవల్లి అసోసియేషన్ వక్ఫ్ బోర్డు అధ్యక్షులకీ సత్కారం



అనంతపురం క్రైం ( సూర్య వాస్తవం): అనంతపురం టైమ్స్ అధినేత హాజీ. కేఎం షకిల్ షఫీ కి రాష్ట్ర ముతవల్లి అసోసియేషన్ వక్ఫ్ బోర్డు అధ్యక్షులుగా నియమించిన సందర్భంగా టిడిపి జిల్లా మైనార్టీ అధ్యక్షుడు సాలార్ భాషా ఐ ఎం ఎం ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మహబూబ్ బాషా ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలసి పుష్ప గుచ్చాలు అందజేసి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న రోజుల్లో మసీదు అభివృద్ధి కొరకు ముస్లిం మైనార్టీ పలు సమస్యల కోసం-ప్రజ సంక్షేమం కోసం సామాజికంగా, రాజకీయంగా విశేష సేవలు చేయాలని వారు కోరారు .ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్ అధ్యక్షుడు షబ్బీర్, నాసిర్ ఖాన్ ,కరీముల్లా, నూర్ మహమ్మద్ ,అక్రమ్ ,అల్లబకాష్, జిలాన్ ,జాకీర్, సమీవుల్లా, బాబా తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను సన్మానించిన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



కుప్పం , సూర్య వాస్తవం: కుప్పం వృత్తి విద్యా కళాశాలలో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఫలితాలు రావడంపై ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ హర్షం వ్యక్తం చేశారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ప్రిన్సిపల్ జ్యోతీశ్వరన్, అధ్యాపకులు జగదీష్ బాబు ఆధ్వర్యంలో సన్మానించారు. కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులు ఉన్నత స్థానానికి చేరుకోవడానికి దారి చదువేనని, తల్లిదండ్రుల కలలు సహకారం కావడానికి కృషి చేయాలన్నారు.

## భూ ఆక్రమణదారుని హెచ్చరించిన ఆర్డీఓ

తవణంపల్లి, సూర్య వాస్తవం: ప్రజా పరిష్కార వేదికలో గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదుకు ఆర్డీఓ పుల్లయ్య స్పందించారు. తవణంపల్లి మండలం మడమనేరి గ్రామంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని తిరిగి అప్పజెప్పాలని కబ్జాదారుడు పార్ధసారది రెడ్డిని ఆర్డీఓ పుల్లయ్య హెచ్చరించారు. తహశీల్దార్ అరుణకుమారి, సర్వేయర్ బాబు, షణ్ముగం, వీఆర్వో, ఇతర సిబ్బంది పాల్గొనారు.



# 158 ఎర్రచందనపు దుంగలను స్వాధీనం : ఎర్రగుంట్ల పోలీస్

కడప, సూర్య వాస్తవం: కడప ఎస్పీ సిద్ధార్థ కౌశల్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జమ్మలమడుగు ఎస్డిపిఓ టిడి యశ్వంత్ ఆధ్వర్యంలో ఎర్రగుంట్ల అర్బన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఆర్ ఈశ్వరయ్య ఎస్ఐలు ఎం భాస్కర్ రెడ్డి మరియు టీవీఎన్ చిరంజీవి రాబడిన సమాచారం మేరకు మూడో తేదీ ఉదయం 8 గంటలకు పొట్ల దుర్తి గ్రామం దగ్గర కొత్త కాలనీ క్రాస్ వద్ద ప్రొద్దుటూరు ఎర్రగుంట్ల రోడ్డులో ఒక మినీ లారీ రోడ్డు పైన ఉండినది. ఒకటి మూడు నుండి నాలుగు వరకు తెలిపిన ముద్దాయిలు పారిపోయే పోవుటకు ప్రయత్నించగా ఇన్స్పెక్టర్ వారి సిబ్బంది సహాయంతో ముద్దాయిలను పట్టుకొని మినీ లారీని పరిశించగా అందులో 44 ఎర్రచందనం దుంగలు ఉండినవి జగనన్న కాలనీ వైపు నుండి తెలిపిన ఒకటో ముద్దాయి ఇంకా కొంతమంది మోటార్ సైకిల్ లో వస్తూ ఉండగా వారి వెనకాల ఒక ట్రాక్టర్ వస్తూ ఉండినది పోలీసు వారిని చూసి





మోటర్ సైకిల్ లోని వ్యక్తులు మోటార్ సైకిల్ ను పడవేసి పారిపోయారు. ట్రాక్టర్ డ్రైవర్ను పట్టుకొని ట్రాక్టర్ను పరిశించగా 40 ఎర్రచందనం దుంగులు ఉండనవి. దూదేకుల భాష జగనన్న కాలనీలో ఉన్న మొత్తం 150 8 ఎర్రచందనపు దుంగలను తన ఇంటి నుండి లోడ్ చేసుకొని మినీ లారీలో లోడ్ చేయడానికి పోతూ ఉండగా పట్టుకున్నారని దూదేకుల భాష ఇంటిలో 74 ఎర్రచందనం దుమ్ములు ఉండినవి సదరు ఎర్రచందనం దుమ్ములను పోరుమామిళ్ల బద్వేల్ పరిధిలోని నల్లమల్ల అటవీ ప్రాంతం నుండి తీసుకొని వచ్చి పొట్లదుర్తి గ్రామం భాష ఇంటిలో డంపు చేసి అక్కడ నుండి చెన్నైకి తరలించే సమయంలో పట్టుబడటం జరిగినది. ఎర్రగుంట్ల ఎస్డిపిఓ టి డి యశ్వంత్ మరియు ఎర్రగుంట్ల పోలీస్ సిబ్బందికు ఎస్పీ సిద్ధార్థ కౌశల్ అభినందించడం జరిగింది. మీడియాతో మాట్లాడే ముందు ఎస్పీ సిద్ధార్థ కౌశల్ ఎర్రచందనం దుంగలను పరిశీలించడం జరిగింది.

# నేడు వాలంటీర్లు ఛలో విజయవాడకు పిలుపు

- రాజీనామా చేసిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలి
- వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి
- ఛలో విజయవాడకి ఎటువంటి అనుమతులు లేవని తేల్చి చెప్పిన పోలీసు శాఖ

కడప బ్యూరో సూర్య వాస్తవం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వాలంటీర్ల సాయం తీసుకోకుండా పెన్షన్లను పంపకాలు చేసింది. 1 లక్షా 20 వేల మంది సచివాలయ సిబ్బందే ఒక్కరోజులో దాదాపుగా పెన్షన్లను వృద్ధులకు, వితంతువులు, వికలాంగులకు పంపిణీ చేశారు. దీంతో వాలంటీర్లతో ఇక పనేముంది? వాళ్లను ప్రభుత్వం తొలగిస్తుందనే ప్రచారం కాసంత జోరుగా కొనసాగుతుంది. దాంతో వాలంటీర్లలో ఆందోళన మొదలయ్యింది. తమను తొలగిస్తారేమో అని వారు ఆందోళనలో ఉన్నారు. అయితే, వాలంటీర్లను తొలగిస్తామని ప్రభుత్వం ఎక్కడా కూడా ఇప్పటి వరకు చెప్పలేదు. పైగా నిన్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దీనిపై కీలక ప్రకటనలు కూడా చేశారు. అయితే గ్రామంలో వాలంటీర్ అయి ఉండి, ప్రస్తుత ప్రభుత్వం వాలంటీర్ వ్యవస్థ మీద ఎటువంటి నిర్ణయం లేదా భరోసా కలిపించక పోవడంతో వాలంటీర్ల వ్యవస్థకు భద్రత కల్పించాలని కోరుతూ బుధవారం ఛలో విజయవాడ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. అయితే ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి ఇవ్వలేదు. దీంతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఛలో విజయవాడ కార్యక్రమంపై విజయవాడ పోలీసులు రియాక్ట్ అయ్యారు. వాలంటీర్లు రేపు ఛలో విజయవాడ కార్యక్రమానికి అనుమతి లేదని పోలీసులు వెల్లడించారు. అలాగే మాకు అనుమతి కోసం ఎలాంటి దరఖాస్తు రాలేదని పేర్కొన్నారు. విజయవాడ కమిషనరేట్ పరిధిలో 144 సెక్షన్ తో పాటు సెక్షన్ 30 అమల్లో ఉంది. కాబట్టి అనుమతి లేదనే విషయాన్ని వాలంటీర్లకు తెలియజేస్తున్నామని పోలీసులు అంటున్నారు. వైఎస్ఆర్ కడప జిల్లాతో పాటుగా వేరే ప్రాంతాల నుంచి విజయవాడ నగరానికి వచ్చే వాలంటీర్లను అదుపులోకి తీసుకోవటానికి రైల్వే స్టేషన్, బస్టాండ్ దగ్గర ప్రభుత్వ ఆదేశాలతో పోలీసులు భారీ బందోబస్తు చర్యలు చేపట్టారు.



# ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి - ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, సూర్య వాస్తవం: ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక మహ్మదీయ కాలనీలో 22వ వార్డు కౌన్సిలర్ మహమ్మద్ గౌస్ నివాసంలో నిర్వహించిన ఆయన జన్మదిన వేడుకల లో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌస్ ఎమ్మెల్యే ను గజమాలతో సత్కరించారు. కేక్ కట్ చేసి ఎమ్మెల్యే కు గౌస్ అందజేశారు. కాగా కౌన్సిలర్ గౌస్ మిత్రబృందం గౌస్ పుట్టినరోజు సందర్భంగా రక్తదానం శిభిరం ఏర్పాటు చేయగా, ఈ శిబిరంలో గౌస్, దాదాపు మరో 50 మంది రక్తదానం చేసి, మహమ్మద్ గౌస్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ అన్ని దానాలలో రక్తదానం మిన్న అన్నారు. మనం రక్తదానం చేయడం వలన ప్రాణాపాయ స్థితిలో వున్న వారిని కాపాడవచ్చని తెలిపారు. ఇటువంటి కార్యక్రమం నిర్వహించిన కౌన్సిలర్ గౌస్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, కౌన్సిలర్లు మురళీధర్ రెడ్డి, మునీర్, టిడిపి నాయకులు బచ్చల ప్రతాప్, మున్నా, గౌస్, రామచంద్రారెడ్డి, మాజీ జడ్పీటీసీ భాస్కర్, తదితర నాయకులు పాల్గొని గౌస్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వాడకంపై అవగాహన సదస్సు

అన్నమయ్య సూర్య వాస్తవం: లయన్స్ క్లబ్ అఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో స్థానిక చౌడేశ్వరి గుడి దగ్గర జిల్లా పరిషత్ హై స్కూల్ నందు ప్లాస్టిక్ దినోత్సవం సందర్భంగా ప్లాస్టిక్ వాడకం పై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగిందని అధ్యక్షులు లయన్ శివారెడ్డి తెలిపారు. అనంతరం జి ల్టీ కోఆర్డినేటర్ లయన్ హరినాథ్ రెడ్డి సీనియర్ లయన్స్ సభ్యులు లయన్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ యొక్క అత్యంత ముఖ్యమైన లోపాలలో దాని పర్యావరణ ప్రభావం ఒకటి. ప్లాస్టిక్ కాలుష్యం ప్రపంచవ్యాప్తంగా పెద్ద సమస్య,పల్లపు ప్రదేశాలు, నీటి వనరులు మరియు సహజ పరిసరాలలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి.ప్లాస్టిక్‌లు కుళ్ళిపోవడానికి వందల నుండి వేల సంవత్సరాలు పట్టవచ్చు,కావున ప్లాస్టిక్ వాడకం తగ్గించి ప్లాస్టిక్ రహిత సమాజంగా తీర్చిదిద్దాలని తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు,లయన్ నాగార్జున ఆచారి,లయన్ చాన్ బాషా కార్యదర్శి లయన్ ఇందాద్ అహ్మద్,లయన్ ప్రకాష్ రెడ్డి ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.




## బడి బయట పిల్లలను బడిలో చేర్పించండి

### -ఏ ఎల్ ఎస్ కోఆర్డినేటర్ అజయ్ కుమార్ రెడ్డి

బంగారుపాలెం, సూర్య వాస్తవం: బంగారుపాళ్యం మండలం మొగి లిమిట్టూరు పంచాయతీ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ను జిల్లా ప్రత్యామ్నాయ పాటశాలల సమన్వయ కర్త ఏ ఎల్ ఎస్ కోఆర్డినేటర్ అజయ్ కుమార్ రెడ్డి విద్యా ప్రవేశ కార్యక్రమంలో భాగంగా సందర్శించి పాఠశాల లో బడిలో చేరని పిల్లలను బడి బయటి పిల్లల ను సర్వే లో పాల్గొని వారిని బడికి వచ్చే విధంగా బుధవారం అవగాహన కలిగించడం జరిగినది.ఈ కార్యక్రమంలో మొగిలి మిట్టూరు , మొగిలి వారిపల్లె, లక్ష్మీ పురం, మొగిలి గాండ్ల పల్లె మొదలగు గ్రామాలలో బడి బయటి పిల్లల నమోదు చేయడం జరిగినది .ఈ కార్యక్రమంలో మండల విద్యా శాఖాధికారి పి. నాగేశ్వర రావు , ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెంగల్ రెడ్డి సి ఆర్ పి ప్రేమలత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## కేంద్ర మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన టిడిపి నాయకులు



రైల్వే కోడూరు ,సూర్య వాస్తవం: రైల్వే కోడూరు పట్టణానికి చెందిన మాజీ సర్పంచ్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మలిశెట్టి మురళీధర్ గౌడ్ కేంద్ర విమానయాన శాఖ మంత్రిని బుధవారం కింజరపు రామ్మోహన్ నాయుడును కలిశారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడుకి మలిశెట్టి మురళీధర్ గౌడ్ కి పాత సన్నిహిత సంబంధాలు ఉండడంతో మొట్టమొదటి సారిగా కేంద్ర మంత్రిగా ఎంపికైన సందర్భంగా మలిశెట్టి మురళీధర్ గౌడ్ రామ్మోహన్ నాయుడుకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వే కోడూరు చెందిన ఆర్యవైశ్య నాయకులు సిహెచ్ హరినాథ్ తో పాటు పలువురు టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి




ప్రొద్దుటూరు, సూర్య వాస్తవ): స్థానిక మైదుకూరు రోడ్డులో ఉన్న ఆర్టీసీ బస్టాండ్ లో జరుగుతున్న నిర్మాణ పనులను బుధవారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పరిశీలించారు. ఆప్రాంతాన్ని సందర్శించిన ఎమ్మెల్యే నిర్మాణ పనులు, మెకానిక్ షెడ్, రిపేరులో ఉన్న బస్సుల వివరాలు, తదితర వాటి గురించి డిపో డి.యం మల్లిఖార్జున రెడ్డి ఇతర అధికారులతో చర్చించారు. అధికారులతో కలసి మెకానిక్ షెడ్ లోని వస్తువులు, క్యాంటిన్, విచారణకేంద్రాన్ని, పార్సిల్ కౌంటర్ పరిశీలించారు. పనులు నాణ్యతగా జరిపి, ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట కొత్తపల్లె పంచాయితీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి వున్నారు.

## భరోసా కల్పించిన ఎమ్మెల్యే జయరాం



పామిడి సూర్య వాస్తవం : పట్టణంలో ఉన్నటువంటి టీ స్టాల్ రమేష్ గౌడ్. గత కొద్ది రోజుల కిందట రోడ్డు ప్రమాదంలో కాలికి గాయమైనందున. మెరుగైన వైద్యం చేయించుకుంటూ ఉన్నందున విషయం తెలుసుకున్న గుంతకల్ నియోజకవర్గం శాసనసభ్యుడు గుమ్మనూరు జయరాం. .రమేష్ గౌడ్ ని ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుని. ఆధర్య పడవ ద్దు అండగా కుటుంబానికి తెలుగుదేశం పార్టీతోపాటు గుమ్మనూరు కుటుంబం సభ్యులు కూడా అండగా ఉంటారని భరోసా కల్పించారు ఏది ఏమైనా పార్టీ కోసం కష్టపడిన వారికి ప్రతి ఒక్కరికి తెలుగుదేశం పార్టీలో గుర్తింపు ఉంటుంది మధ్యలో ఎవరెవరో లేనిపోని ఆరోపణ చేస్తే అవన్నీ నమ్మకండి కార్యకర్తలకు ఏదైనా సమస్య వస్తే నా కుమారుడు ఈశ్వర్ కి. తెలియజేయండి వెంటనే సమస్యల. చర్చించుకుని కలిసిమెలిసిగా ఉండడానికి ప్రయత్నించాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## చంద్రన్న విద్యా కానుక కిట్ల పంపిణీ

రామకుప్పం, సూర్య వాస్తవం: రామకుప్పం జిల్లా పరిషత్ పాఠశాల నందు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తల చేతుల మీదుగా చంద్రన్న విద్యా కానుక కిట్లు మరియు స్టడీ మెటీరియల్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రామకుప్పం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఆనంద రెడ్డి, మునిస్వామి, ఆంజనేయ రెడ్డి, రామకృష్ణ, సీతాపతి, విజయ్ కుమార్ రెడ్డి, మైనార్టీ ప్రధాన కార్యదర్శి ఆదిల్, బిజెపి, జనసేన, నేతలు మరియు మండల విద్యాశాఖ అధికారులు,పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.




# సినిమా

## వైల్డ్ ఫోటోగ్రాఫర్‌గా మారిన సదా




తొలి సినిమాతోనే తెలుగు కుర్రాళ్ల హృదయాలను దొచేసింది ఓ హీరోయిన్. అందం, అభినయంతోపాటు సంప్రదాయంగా కనిపించి యువతలో మంచి ఫాలోయింగ్ సంపాదించుకుంది. మొదటి మూవీతోనే భారీ విజయాన్ని అందుకుని అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ సినిమా తర్వాత తెలుగులో బ్యాక్ టూ బ్యాక్ ఆఫర్స్ అందుకుంటూ అతి తక్కువ సమయంలో తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకుంది. దశాబ్ద కాలంపాటు సినిమాల్లో అలరించిన ఆ తార ఇప్పటికీ సింగిల్. పెళ్లి చేసుకోకుండా ఒంటరిగా లైఫ్ ఎంజాయ్ చేస్తుంది. చాలా కాలం సినిమాలకు దూరమై ఆ బ్యూటీ.. ఇప్పుడు ఫుల్ టైమ్ వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్ గా సెటిల్ అయ్యింది. ఇంతకీ ఆ బ్యూటీ ఎవరో తెలుసా..? తనే హీరోయిన్ సదా. 2003లో నితిన్ హీరోగా పరిచయమైన జయం సినిమాతో సినీరంగంలోకి అడుగుపెట్టింది. మొదటి సినిమాతోనే సూపర్ హిట్ అందుకుని ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకుంది. తెలుగు, కన్నడ, తమిళంలో అనేక చిత్రాల్లో నటించి మెప్పించింది. హెూమ్లీ లుక్, అద్భుతమైన నటన, ఆకట్టుకునే అందంతో అప్పట్లో కుర్రాళ్ల ఫేవరేట్ హీరోయిన్ గా మారింది. డైరెక్టర్ శంకర్ దర్శకత్వం వహించిన అపరిచితుడు సినిమాలో సదా కథానాయికగా నటించగా.. అప్పట్లో ఈ మూవీ సూపర్ హిట్ అయ్యింది. ఆ తర్వాత వరుస ఆఫర్స్ అందుకున్న సదా ఖాతాలో నెమ్మదిగా డిజాస్టర్స్ వచ్చి చేరాయి. దీంతో సదాకు ఆఫర్స్ తగ్గిపోయాయి. ఇప్పుడు సినిమాలకు దూరంగా ఉంటున్న సదా.. కొన్నాళ్లుగా బుల్లితెరపై పలు షోలలో జడ్జిగా వ్యవహరిస్తుంది. ఇదిలా ఉంటే.. ప్రస్తుతం సదా వైల్డ్ లైఫ్ ఫోటోగ్రఫీపై దృష్టి పెట్టినట్లుగా తెలుస్తోంది. కొన్ని నెలలుగా సదా ఇన్ స్టాలో వైల్డ్ లైఫ్ ఫోటోగ్రఫీకి సంబంధించిన ఫోటోస్, వీడియోస్ కనిపిస్తున్నాయి. అడవిలో సింహాలు, పులులు, ఏనుగులు, పక్షులను అందంగా ఫోటోస్, వీడియోస్ తీస్తూ తన ఇన్ స్టాలో షేర్ చేసింది. సదా చేసిన పోస్టులకు భారీ సంఖ్యలో లైక్స్ వస్తున్నాయి. అందమైన అమ్మాయి పులులు, సింహాలను అంతే అందంగా కెమెరాలో బంధిస్తుందంటూ కామెంట్స్ చేస్తున్నారు నెటిజన్స్. ప్రస్తుతం నచ్చిన పని చేసుకుంటూ హ్యాపీగా ఉన్నానని.. తన ఫ్రీడమ్ ను పోగొట్టుకోవాలని లేదని.. నచ్చిన వ్యక్తి ఇప్పటివరకు దొరకలేదని.. అందుకే పెళ్లి అనే ఆలోచన రాలేదని గతంలో ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది.

## మిడిల్ క్లాస్ మహిళగా నివేదా



మలయాళ బ్యూటీ నివేదా థామస్ ఈ మధ్య సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టి వైరల్ అయిన విషయం తెలిసిందే. 'కొంతకాలం గడిచింది.. కానీ.. చివరిగా!' అంటూ నర్మగర్భంగా పోస్ట్‌లో అక్షరాలను పొందుపరిచింది నివేద. ఇక ఈ పోస్ట్ చూసిన కొందరు నెటిజన్లు నివేతా పెళ్లి చేసుకోబోతుంది అంటూ కామెంట్లు పెట్టగా.. మరికొందరు మూవీ అప్‌డేట్ అయ్యింటుందని కామెంట్లు పెట్టారు. అయితే అందరు అనుకున్నట్లుగానే ఈ పోస్ట్ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా పెట్టినట్లు క్లారిటీ ఇచ్చింది. నివేదా థామస్, యువ నటుడు విశ్వదేవ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 35- చిన్న కథ కాదు ..ఈ సినిమాకు డెబ్యూ డైరెక్టర్ నందకిశోర్ దర్శకత్వం వహిస్తుండగా.. ప్రియదర్శి తదితరులు కీలక పాత్రలో నటించబోతున్నారు. ఈ చిత్రాన్ని సురేశ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రానా దగ్గుబాటి సమర్పిస్తుండగా.. సృజన్ యరబోలు సిద్దార్థ్ రాళ్లపల్లి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ మూవీ ఆగస్టు 15న తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో విడుదల కానుంది. ఇప్పటికే విడుదల తేదీని అనౌన్స్ చేసిన చిత్రబృందం తాజాగా ఫస్ట్ లుక్‌తో పాటు టీజర్ అప్‌డేట్ ఇచ్చింది. ఈ మూవీ ఫస్ట్ లుక్‌ను రానా దగ్గుబాటి సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు. ఇక ఈ ఫస్ట్ లుక్ చూస్తే.. నివేదా థామస్ ఇందులో మిడిల్ క్లాస్ మహిళగా కనిపించబోతున్నట్లు తెలుస్తుంది.

## విశ్వక్‌సేన్ చిత్రానికి దర్శకేంద్రుడి క్లాప్




ఈ ఏడాది గామి, 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' సినిమాలతో హిట్లు అందుకున్న మాస్ కా దాస్ విశ్వక్‌సేన్ ప్రస్తుతం వరుస సినిమాలను లైన్‌లో పెడుతున్నాడు. ఇక విశ్వక్ నటిస్తున్న ప్రాజెక్ట్‌లలో ఒకటి 12. లైలా అనే టైటిల్‌తో వస్తున్న ఈ సినిమాకు కొత్త దర్శకుడు రామ్ నారాయణ్ దర్శకత్వం వహించబోతున్నాడు. ఈ చిత్రం నేడు అధికారికంగా పూజ కార్యక్రమలు పూర్తి చేసుకుంది. ఈ వేడుకకు.. దర్శక దిగ్గజం కే రాఘవేంద్ర రావు ముఖ్య అతిథిగా వచ్చి ముహూర్తం క్లాప్ కొట్టగా.. హరీష్ శంకర్ కెమెరా స్విచ్ ఆన్ చేసాడు. ఇక ఈ సినిమాలో విశ్వక్‌సేన్ లేడీ గెటప్‌లో కనిపించబోతున్నాడు. ఈ సందర్భంగా మూవీ ఫస్ట్ లుక్‌ను మేకర్స్ లాంచ్ చేశారు. ఆకాంక్ష శర్మ ఫీ మేల్ లీడ్ రోల్‌లో కనిపించబోతుందని ఇన్‌సైడ్ టాక్. తనిష్క్ బాగ్చి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించగా.. రిచర్డ్ ప్రసాద్ సినిమాటోగ్రఫర్‌గా పనిచేస్తున్నారు.

# ఆరోగ్యం

## సీమ చింతకాయతో ఎన్ని హెల్త్ బెనిఫిట్స్ తెలుసా..



సీమ చింత కాయలు అంటే సిటీలో ఉండే వారి కంటే.. పల్లెటూరులో ఉండే వారికి బాగా తెలుస్తుంది. వీటినే గుబ్బ కాయలు అని కూడా పిలుస్తారు. ఇవి ఆరోగ్యానికి చాలా మంచివి. ఇందులో శరీరానికి కావాల్సిన అనేక పోషకాలు లభిస్తాయి. ఇవి చిక్కుడు కాయల్లా.. కాకపోతే గింజలు పెద్దగా ఉంటాయి. తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఇవి ఎక్కువగా పెరుగుతాయి. ఇవి ఎక్కువగా వేసవి కాలంలో మాత్రమే.. సీమ చింత కాయలు అంటే సిటీలో ఉండే వారి కంటే.. పల్లెటూరులో ఉండే వారికి బాగా తెలుస్తుంది. వీటినే గుబ్బ కాయలు అని కూడా పిలుస్తారు. ఇవి ఆరోగ్యానికి చాలా మంచివి. ఇందులో శరీరానికి కావాల్సిన అనేక పోషకాలు లభిస్తాయి. ఇవి చిక్కుడు కాయల్లా.. కాకపోతే గింజలు పెద్దగా ఉంటాయి. తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఇవి ఎక్కువగా పెరుగుతాయి. ఇవి ఎక్కువగా వేసవి కాలంలో మాత్రమే లభ్యమవుతాయి. ఇది కాస్త వగరుగా, తియ్యాగా ఉంటాయి. వీటిని తింటే ఆరోగ్యానికి మాత్రం చాలా మంచిది. సీమ చింతకాయల్లో ఐరన్, మెగ్నీషియం, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు ఎ, బి, సి వంటివి పుష్కలంగా లభ్యమవుతాయి. షుగర్, బీపీ ఉన్నవారు కూడా ఎలాంటి డౌట్స్ లేకుండా వీటిని నేరుగా తినొచ్చు. వీటిని తినడం వల్ల కీళ్ల నొప్పులు, సీజనల్ వ్యాధులు, మలబద్ధకం, జీర్ణ సమస్యలు రాకుండా ఉంటాయి. అదే విధంగా గుండె ఆరోగ్యానికి కూడా చాలా మంచివి. శరీరంలో రోగ నిరోధక శక్తి కూడా పెరుగుతుంది. క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులు కూడా రావు.

## కమ్మటి తేనెను వేడి చేస్తే విషంగా మారుతుందా..?



చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు చాలా మంది తేనెను ఇష్టంగా తింటారు. తేనెలో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. తేనెలో యాంటీబయా టిక్, యాంటీఆక్సిడెంట్ గుణాలు ఉన్నాయి. ఇవి మన శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతాయి. తేనెను ఎప్పుడూ వేడి చేయకూడదని, వేడి చేయడం వల్ల తేనె విషంగా మారుతుందని చెబుతుంటారు. అయితే, వేడిచేసిన తర్వాత తేనె నిజంగా విషపూరితమా? ఇప్పుడు తెలుసుకుందాం..తేనెను వేడి చేయడం వల్ల దానిలోని అన్ని పోషకాలు మరియు ఎంజైమ్‌లు నాశనం అవుతాయి. తేనెలోని అన్ని పోషకాలు, ఎంజైములు పువ్వుల నుండి వస్తాయి. ఈ పువ్వులు తరువాత పండ్లు, కూరగాయలుగా రూపాంతరం చెందుతాయి. మనం కూరగాయలను వండుకుంటాము. కాబట్టి అవి విషపూరితం కావు, వేడిచేసినప్పుడు తేనె ఎలా విషంగా మారుతుందని ప్రశ్నిస్తున్నారు కొందరు ఆరోగ్య నిపుణులు. తేనెను వేడి చేసిన తర్వాత ఇతర పదార్థాలతో తీసుకోవడం సులభం. కానీ తేనెలోని ప్రయోజనకరమైన ఎంజైమ్‌లు, యాంటీఆక్సిడెంట్లు, పోషకాలను తగ్గిపోతాయి. దీంతో తేనె పోషక విలువను తగ్గిస్తుందని మరి కొందరు నిపుణులు చెబుతున్నారు. ముడి తేనె సహజమైనది, కాబట్టి ఇది ఎక్కువ పోషక లక్షణాలను కలిగి ఉంటుంది. అందుకే, తేనెను చాలా తక్కువగా వేడి చేయాలి. ఇది బేకింగ్ లేదా సాస్‌లను తయారు చేసేటప్పుడు ఉపయోగపడు తుంది. తేనెలో ఆరోగ్యకరమైన ఎంజైమ్‌లు, అమైనో ఆమ్లాలు, విటమిన్ సి, డి, ఇ, కె, బితో పాటూ బీటాకెరాటిన్, ఎసెన్షియల్ ఆయిల్స్, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్స్ లభిస్తాయి. కానీ తేనును వేడి చేయడం వల్ల ఇవన్నీ వాటి సహజగుణాలను కోల్పోతాయి. అవి ప్రమాదకర సమ్మేళనాలుగా మారచ్చునని పరిశోధకులు వెల్లడించారు. నివేదిక ప్రకారం కూడా తేనెను వండడం, వేడి చేయడం వల్ల నాణ్యత క్షీణిస్తుంది అని తెలుస్తుంది. తేనెను 40 డిగ్రీల సెల్సియస్ లేదా అంతకన్నా ఎక్కువ ఉష్ణోగ్రత వద్ద వేడి చేయడం వల్ల రసాయన మార్పులు తప్పవు. రుచి కూడా చేదుగా మారుతుంది. అందుకే తేనెను సహజంగానే, గది ఉష్ణోగ్రత వద్దనే తినాలి. తేనెను వేడి చేయాలా వద్దా అనేది వ్యక్తిగత నిర్ణయం, కానీ మీరు తేనె సహజ ప్రయోజనాలను నిలుపుకోవాలనుకుంటే, ముడి తేనెను తీసుకోవడం ఎల్లప్పుడూ ఉత్తమం అంటున్నారు పోషకాహార నిపుణులు. ఆయుర్వేదం ప్రకారం తేనెను వేడి చేయకూడదని చెబుతున్నారు. వేడి వేడి పదార్థాలలో కూడా తేనెను కలపకూడదని చెబుతుంటారు. ఇలా వేడికి గురైన తేనె తాగడం వల్ల విషపూరిత అణువులు జీర్ణ వ్యవస్థ శ్లేష్మ పొరలకు అంటుకుని అమా అనే టాక్సిన్ గా మారుతాయి. దీనివల్ల కడుపునొప్పితో ఇబ్బంది పడాల్సి వస్తుందని చెప్పారు.. శ్వాసక్రియ, ఇన్సులిన్ సెన్సిటివిటీ, చర్మ వ్యాధులు, బరువు పెరగడం వంటివి జరుగుతాయంటున్నారు.

# క్రీడలు

## నంబర్ వన్‌గా హార్దిక్ పాండ్య..

## 12 స్థానాలు ఎగబాకిన బుమ్రా



టీమ్ఇండియా 2024 టీ20 ప్రపంచ కప్ సాధించడంలో కీలకపాత్ర పోషించిన హార్దిక్ పాండ్య ఐసీసీ ర్యాంకింగ్స్ ఆల్‌రౌండర్ల జాబితాలో నంబర్ వన్‌గా నిలిచాడు. ప్రపంచ కప్‌లో బంతితో, బ్యాట్‌తో అదరగొట్టిన పాండ్య రెండు స్థానాలు మెరుగుపర్చు కుని శ్రీలంక ఆటగాడు వానిందు హసరంగ (222 పాయింట్లు)తో కలిసి హార్దిక్ అగ్రస్థానాన్ని పంచుకుంటున్నాడు. ఈ క్రమంలోనే టీ20ల్లో ఆల్‌రౌండర్ల కేటగిరీలో నంబర్ వన్‌గా నిలిచిన తొలి భారత క్రికెటర్‌గా హార్దిక్ రికార్డు సృష్టించాడు. ఇక తాజా ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో మార్కస్ స్టొయినిస్ (ఆస్ట్రేలియా), సికిందర్ రజా (జింబాబ్వే), షకిబ్ అల్ హసన్ (బంగ్లాదేశ్) ఒక్కో స్థానం మెరుగై వరుసగా మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచారు. అఫ్గానిస్థాన్ ఆల్‌రౌండర్ మహ్మద్ నబీ నాలుగు స్థానాలు దిగజారి ఆరో స్థానానికి పడిపోయాడు. హార్దిక్ పాండ్య ఈ పొట్టి కప్‌లో ఆరు ఇన్నింగ్స్‌ల్లో 151.57 స్ట్రైక్ రేట్‌తో 144 పరుగులు చేశాడు. ఇందులో ఒక అర్ధ సెంచరీ కూడా ఉంది. 8 మ్యాచ్‌ల్లో 7.64 ఎకానమీ రేటుతో 11 వికెట్లు పడగొట్టాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన ఫైనల్‌లో (3/20) అత్యుత్తమ ప్రదర్శన చేశాడు. కీలక సమయంలో హెన్రిచ్ క్లాసెన్, డేవిడ్ మిల్లర్‌ను ఔట్ చేసి భారత్ రెండోసారి టీ20 ప్రపంచకప్ సాధించడంలో ప్రధాన పాత్ర పోషించాడు. ఫైనల్‌లో భారత్ గెలిచిన తర్వాత పాండ్య భావోద్వేగానికి గురయ్యాడు. బౌలింగ్ ర్యాంకింగ్స్ విషయానికొస్తే.. దక్షిణాఫ్రికా పేసర్ అన్రిచ్ నోకియా ఏడు స్థానాలు ఎగబాకి రెండో స్థానం దక్కించుకున్నాడు. భారత స్పిన్నర్లు అక్షర్ పటేల్ ఒక స్థానం మెరుగుపర్చుకుని ఏడో స్థానంలో, కుల్‌దీప్ యాదవ్ మూడు స్థానాలు మెరుగై ఎనిమిదో స్థానంలో నిలిచారు. టీ20 ప్రపంచ కప్‌లో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన జస్‌ప్రీత్ బుమ్రా ఏకంగా 12 స్థానాలు ఎగబాకి 12వ స్థానంలో నిలిచాడు.

## భారత్ ఓటమితో రాత్రంతా నిద్ర పట్టలేదు: గంభీర్

వన్డే ప్రపంచకప్-1992లో భారత్ లీగ్ స్టేజ్‌లోనే ఇంటిముఖం పట్టింది. గ్రూప్ దశలో ఆసీస్‌తో మ్యాచ్‌లో కేవలం ఒక్క పరుగు తేడాతో టీమ్ఇండియా ఓడిపోయింది. ఆ మ్యాచ్ జరిగిన రాత్రి తనకు నిద్ర పట్టలేదని.. భారత్ కోసం ప్రపంచకప్ నెగ్గాలని ప్రతిజ్ఞ చేసినట్లు మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్ గుర్తు చేసుకున్నాడు. అప్పుడు తన వయసు కేవలం 11 ఏళ్లు మాత్రమేనని తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించాడు. టీమ్ ఇండియాకు ప్రధాన కోచ్‌గా గంభీర్ దాదాపు ఖాయమైనట్లేనని వార్తలు వస్తున్నాయి. మరికొద్ది రోజుల్లో అధికారిక ప్రకటన వెలువడనుంది. "ఒక మ్యాచ్ చూసిన తర్వాత.. భారత్‌కు వరల్డ్ కప్ అందించాలనే బలమైన ఆకాంక్ష కలిగింది. బ్రిస్బేన్ వేదికగా 1992 వరల్డ్ కప్‌లో ఆసీస్‌తో భారత్ మ్యాచ్ ఆడింది. చివరివరకూ పోరాడినప్పటికీ కేవలం ఒక్క పరుగు తేడాతో ఓటమి పాలైంది. ఆ రోజు రాత్రంతా ఏడుస్తూనే ఉండిపోయా. అంతకుముందు కానీ.. ఆ తర్వాత కానీ ఎప్పుడూ అలా బాధపడిన సందర్భాలు లేవు. ఆరోజు మాత్రం ఎందుకు అలా ఏడ్చానో తెలియదు. నాకు అప్పుడు 11 ఏళ్లు మాత్రమే. నేను భారత్ కోసం వరల్డ్ కప్ నెగ్గుతానని అనుకున్నా. నా కల 2011లో నెరవేరింది. 32 ఏళ్ల కిందట (1992) జరిగిన మ్యాచ్‌లో చివరి ఓవర్‌లో వెంకటపతిరాజు రనౌట్ అయ్యాడు. ఆ మ్యాచ్ మన సమయం ప్రకారం వేకువజామునే జరిగింది. నేను పొద్దున్నే ఐదు గంటలకు నిద్ర లేచి చూశా" అని గంభీర్ తెలిపాడు. తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్ 237/9 స్కోరు చేసింది. వర్షం కారణంగా భారత్ లక్ష్యాన్ని డక్‌వర్త్‌లూయిస్ పద్ధతి ప్రకారం టార్గెట్‌ను 47 ఓవర్లకు 235 పరుగులుగా నిర్దేశించారు. భారత్ సరిగ్గా 234 పరుగులు చేసి ఓడింది.గంభీర్ అనుకున్నట్లుగానే రెండు ప్రపంచకప్‌లను భారత్ నెగ్గడంలో కీలక పాత్ర పోషించాడు. 2007 టీ20 ప్రపంచకప్‌లో భారత్ తరఫున అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. ఇక 2011 వన్డే ప్రపంచ కప్ ఫైనల్‌లో శ్రీలంకపై 97 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు.









IRS PUBLICATIONS, 13-2-819-2, RAMBO RESIDENCE, RTC BUS STAND ROAD, SRINIVAS NAGAR, ANANTAPUR ANANTAPUR,
ANDHRA PRADESH, 515001 GSTIN: 37AAJFI5233N1ZY TEL:7672042522 - EDITOR : M. IRSHAD BAIG - CELL - 918500425222.